



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 145 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం సోమవారం 6 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 145 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM MON 6 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# నీటి సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

- నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత పేరుతో 100 రోజుల కార్యాచరణ
- ఏప్రిల్ 6 నుంచి జులై 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం
- 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులకు కీలక బాధ్యతలు
- అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం
- ప్రజల భాగస్వామ్యంతో కరవు రహిత రాష్ట్రంగా మార్చడమే ధ్యేయం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'నీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో జల సంరక్షణను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా నేడు రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, రాబోయే 100 రోజుల ప్రణాళికపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా, సీఎం చంద్రబాబు రేపు (ఏప్రిల్ 6) తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికిలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు.

**100 రోజుల కార్యాచరణ.. సాగునీటి సంఘాలకు కీలక బాధ్యతలు**

నీటి భద్రత కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులను భాగస్వాములను చేస్తూ వారికి కీలక బాధ్యతలు అప్పగించారు. "ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి, ప్రతి బొట్టును

- మిగతా2లో



# జగన్ దీనికేమని సమాధానం చెబుతారు?

- అమరావతి నిర్మాణ ఖర్చుపై సీఎం జగన్ అబద్ధాలు చెబుతున్నారని కన్నా ఆరోపణ
- రుషికొండ ప్యాలెస్ నిర్మాణానికి చ.అడుగుకు రూ.35,714 ఖర్చు చేశారని విమర్శ
- అమరావతి నిర్మాణానికి అయ్యేది చ.అడుగుకు రూ.6,985 మాత్రమేనని వెల్లడి
- సొంత విలాసాల కోసం జగన్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ
- తెలంగాణ సచివాలయం, పార్లమెంటు భవనాలతో నిర్మాణ వ్యయాన్ని పోల్చిన కన్నా

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ పై తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమరావతి రాజధాని నిర్మాణ వ్యయంపై జగన్ ఉద్దేశపూర్వకంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విశాఖపట్నంలోని రుషికొండపై నిర్మించిన ప్యాలెస్

- మిగతా2లో



# జగన్ పేరు కూడా అలాంటిదే

- జగన్ పేరు శుభకార్యాల్లో పలకని అపశకునంలా మారిందని మంత్రి ఎద్దేవా
- అమరావతిని దెబ్బతీసి జగన్ చారిత్రక తప్పిదం చేశారని తీవ్ర విమర్శ
- అమరావతి అనేది లక్షల కోట్ల రాబడినిచ్చే సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్ అని వెల్లడి
- కూటమి పాలనలో రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా అభివృద్ధి చేస్తున్నామని స్పష్టీకరణ
- అబద్ధాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం మానుకోవాలని జగన్‌కు హితవు

- మిగతా2లో

## ఇది జగన్ కొత్త ఆలోచన కాదు..
# 11 ఏళ్ల క్రితమే చంద్రబాబు చెప్పారు

- విజయవాడ-గుంటూరు-మచిలీపట్నం గ్రోత్ కారిడార్ జగన్ కొత్త ఆలోచన కాదన్న పట్టాభి
- చంద్రబాబు 2015లోనే 8,350 చ.కి.మీ.లతో సీఆర్డీఏను ఏర్పాటు చేశారని వెల్లడి
- సీఆర్డీఏను రద్దు చేయాలని చూసిన జగన్ ఇప్పుడు ప్రేమ చూపడం విడ్డూరమన్న టీడీపీ
- బిల్లుకు, తీర్మానానికి తేడా తెలియకుండా వైసీపీ గందరగోళం సృష్టిస్తోందని ఆరోపణ
- పార్లమెంటు చేసిన చట్టాన్ని రాష్ట్రం మార్చలేదని, అమరావతి ఆగదని స్పష్టీకరణ

- మిగతా2లో



# సన్‌రైజ్ హాస్పిటల్స్ ఎండీ కుమారుడి పెళ్లి రిసెప్షన్ కు లోకేశ్ హాజరు...

- వివాహ రిసెప్షన్‌కు హాజరైన మంత్రి నారా లోకేశ్
- విజయవాడ సన్‌రైజ్ హాస్పిటల్స్ ఎండీ తనయుడి వివాహం
- మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన వేడుక
- నూతన వధూవరులు సాయి శిశిర్, వైష్ణవిలకు ఆశీస్సులు

- మిగతా2లో





# బాసరకు మహర్దశ...
## రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయ పునరుద్ధరణ

- సోమవారం భూమిపూజ చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- శృంగేరి పీఠాధిపతుల ఆమోదంతో సిద్ధమైన మాస్టర్ ప్లాన్
- ప్రస్తుత విస్తీర్ణం కన్నా మూడు రెట్లు పెరగనున్న ఆలయ ప్రాంగణం
- వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు సౌకర్యాల కల్పనే లక్ష్యం

పెన్ పవర్ డెస్క్:దక్షిణ భారతదేశంలో ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయంగా ప్రసిద్ధి చెందిన బాసర క్షేత్రం కొత్త శోభను సంతరించుకోనుంది. వేల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పుణ్యక్షేత్రం పునఃనిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.225 కోట్లు కేటాయించింది. ఈ బృహత్తర ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం నాడు భూమి పూజ చేసి పనులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. శృంగేరి పీఠాధిపతుల మార్గదర్శకత్వంలో, ఆగమశాస్త్ర నియమాలకు అనుగుణంగా ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు.

**శృంగేరి పీఠం మార్గదర్శకత్వంలో పనులు**

వేదవ్యాస మహర్షి స్వయంగా ఇసుకతో సరస్వతి, లక్ష్మి, కాళి అమ్మవార్ల మూర్తులను ప్రతిష్ఠించారని స్థలపురాణం చెబుతోంది. ఇంతటి

- మిగతా2లో

# హర్మూజ్ జలసంధి తెరవకపోతే
## పవర్ ప్లాంట్ డే, బ్రిడ్జ్ డే రెండూ ఒకేసారి చూస్తారు
## ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్



- హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- తీవ్ర పరిణామాలు తప్పవంటూ సోషల్ మీడియాలో పోస్ట్
- మరో శాశ్వత యుద్ధంలోకి వెళుతున్నామని గవర్నర్ వెస్ మూర్ ఆందోళన
- ఈ యుద్ధానికి నైతిక సమర్థన లేదన్న ఆర్చ్‌బిషప్ తిమోతి బ్రోగ్లియో
- ట్రంప్ వైఖరిపై అమెరికాలో పెరుగుతున్న వ్యతిరేక స్వరాలు

- మిగతా2లో

## కడప జిల్లాలో కాలి బూడిదైన ఆర్టీసీ బస్సు...
# తప్పిన పెను ప్రమాదం

- కడప జిల్లాలో ఆర్టీసీ బస్సుకు అగ్ని ప్రమాదం
- విద్యుత్ తీగలు తగలడంతో చెలరేగిన మంటలు
- డ్రైవర్ వేగంగా స్పందించడంతో సురక్షితంగా బయటపడ్డ 21 మంది
- ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బస్సు
- పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు

- మిగతా2లో



# అమెరికా రెస్క్యూ ఆపరేషన్ విఫలం చేశాం... ఓ విమానం, రెండు హెలికాప్టర్లను కూల్చేశాం



- తమ గడ్డపై అమెరికా రెస్క్యూ ఆపరేషన్‌ను విఫలం చేశామన్న ఇరాన్
- ఒక రవాణా విమానం, రెండు హెలికాప్టర్లను కూల్చివేసినట్లు ప్రకటన
- ఈ ఆపరేషన్‌లో ఐదుగురు మరణించినట్లు వెల్లడించిన ఇరాన్ మీడియా
- తప్పిపోయిన పైలట్‌ను విజయవంతంగా రక్షించామన్న అమెరికా

పెన్ పవర్ డెస్క్:తమ భూభాగంలో అమెరికా చేపట్టిన ఓ రెస్క్యూ ఆపరేషన్‌ను విఫలం చేశామని ఇరాన్ ప్రకటించింది. ఈ ఆపరేషన్ సందర్భంగా ఒక సీ–130 రవాణా విమానంతో

- మిగతా2లో

# ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి...
## అమిత్ షాకు మంత్రి తుమ్మల లేఖ

- భద్రాచలం సమీపంలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపాలని వినతి
- పాలనా సౌలభ్యం, గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఈ నిర్ణయం అవసరం
- ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనం బిల్లు పెట్టాలని అభ్యర్థన

- మిగతా2లో



# ఈసారి సరిహద్దుల్లో కాదు.. నేరుగా కోల్‌కతాపైనే అటాక్ చేస్తం

పెన్ పవర్ డెస్క్:ఇస్లామాబాద్: ఇండియాపై నిత్యం విషం చిమ్మే పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈసారి భారత్ తమపై ఏదైనా దాడి చేస్తే



- మిగతా2లో




## ఇది జగన్ కొత్త ఆలోచన కాదు..
# 11 ఏళ్ల క్రితమే చంద్రబాబు చెప్పారు

విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం ప్రాంతాలను కలుపుతూ 'మావిగన్' పేరిట గ్రోత్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలన్న మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నేత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రంగా స్పందించారు. జగన్ ఇప్పుడు చెబుతున్నది కొత్త ఆలోచన కాదని, 11 సంవత్సరాల క్రితమే నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఈ ప్రణాళికకు శ్రీకారం చుట్టారని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తమకు ఎవరూ అభివృద్ధి పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని, ఏ ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసని పట్టాభి వ్యాఖ్యానించారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

**11 ఏళ్ల క్రితమే చంద్రబాబు విజన్**

2014లో రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రచించారని పట్టాభి గుర్తుచేశారు. ఇందులో భాగంగానే 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించి, క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్డీఏ)ను ఏర్పాటు చేశారని తెలిపారు. దాదాపు 8,350 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో సీఆర్డీఏను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

మచిలీపట్నం సమీపంలోని మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల నుంచి గుంటూరు దాటి ఎడ్లపాడు వరకు సీఆర్డీఏ పరిధి విస్తరించి ఉందని, ఈ మ్యాప్ చూస్తే చంద్రబాబు దార్శనికత ఏమిటో అర్థమవుతుందని అన్నారు. "ఇప్పుడు జగన్ గారు చెబుతున్న గ్రోత్ కారిడార్ ఆలోచన 2015 సెప్టెంబర్ 22న జారీ చేసిన జీవో నంబర్ 207లోనే ఉంది. మచిలీపట్నం నుంచి ఎడ్లపాడు వరకు ఉన్న ప్రాంతమంతా అభివృద్ధి చేయాలనేది చంద్రబాబు నాటి ప్రణాళిక" అని పట్టాభి పేర్కొన్నారు.

**సీఆర్డీఏను రద్దు చేయాలని చూసింది మీరు కాదా?**

ఈ ప్రాంతంపై ఇప్పుడు కొత్తగా ప్రేమ చూపిస్తున్న జగన్మోహన్ రెడ్డి, 2020లో ఇదే సీఆర్డీఏ చట్టాన్ని రద్దు చేసేందుకు ఎందుకు ప్రయత్నించారని పట్టాభి ప్రశ్నించారు. మూడు రాజధానుల పేరుతో ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవాలని చూసింది నిజం కాదా అని నిలదీశారు. "ఒకవైపు హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ, ఔటర్ రింగ్ రోడ్డుతో చంద్రబాబు ఎలా అభివృద్ధి చేశారో అందరికీ తెలుసు. అదే తరహా విజన్‌తో ఏపీలో సీఆర్డీఏను ఏర్పాటు చేస్తే, దాన్ని నాశనం చేయాలని జగన్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఇప్పుడు ఓటమి తర్వాత మళ్లీ ఈ ప్రాంతంపై ప్రేమ నటిస్తున్నారు" అని ఆయన విమర్శించారు.

**బిల్లు వేరు.. తీర్మానం వేరు**

అమరావతి రాజధానిపై అసెంబ్లీలో తీర్మానం చేసి కౌన్సిల్‌కు ఎందుకు పంపలేదని వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పట్టాభి ఆరోపించారు. బిల్లుకు, తీర్మానానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. "బిల్లు అనేది చట్టరూపం దాల్చాలంటే ఉభయ సభల ఆమోదం తప్పనిసరి. కానీ, తీర్మానం (రెజల్యూషన్) అనేది కేవలం ఒక అభిప్రాయాన్ని వ్యక్తపరచడం కోసం చేసేది. కేంద్ర ప్రభుత్వం ఏపీ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసి పంపమని కోరింది. అందుకే అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాం. ఆ తర్వాత కేంద్రం పార్లమెంటులో బిల్లు పెట్టి ఉభయ సభల్లో ఆమోదింపజేసింది. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన మూడు రాజధానుల అంశం 'బిల్లు' కాబట్టే కౌన్సిల్‌కు వెళ్లింది. కానీ ఇది కేవలం 'తీర్మానం' మాత్రమే," అని ఆయన స్పష్టం చేశారు.

**పార్లమెంటు చట్టాన్ని రాష్ట్రం మార్చలేదు**

జగన్మోహన్ రెడ్డి ఎన్ని మాట్లాడినా అమరావతి అభివృద్ధిని ఆపడం ఎవరివల్లా కాదని పట్టాభి అన్నారు. పార్లమెంటులో ఆమోదం పొందిన చట్టాన్ని ఒక రాష్ట్ర అసెంబ్లీ మార్చలేదన్న కనీస అవగాహన లేకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అమరావతి పనులు వేగంగా ముందుకు సాగుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే సీఎం సమీక్షలు నిర్వహించి పనులకు టార్గెట్లు నిర్దేశించారని, త్వరలోనే రాజధానిలో భవనాలు వేగంగా పైకి లేస్తాయని అన్నారు.

**అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

కూటమి ప్రభుత్వం కేవలం అమరావతికే పరిమితం కాదని, ఉత్తరాంధ్ర, రాయలసీమతో సహా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని పట్టాభి తెలిపారు. ఉత్తరాంధ్రకు ఆర్సెలార్ మిట్టల్, అదానీ డేటా సెంటర్ వంటి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, రాయలసీమకు పరిశ్రమలు తీసుకురావడంతో పాటు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కూడా చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని చెప్పారు. నారా లోకేష్ లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారని, అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## అమెరికా రెస్క్యూ ఆపరేషన్ విఫలం చేశాం... ఓ విమానం, రెండు హెలికాప్టర్లను కూల్చేశాం

- మొదటి పేజి తరువాయి

పాటు రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లను కూల్చివేసినట్లు ఇరాన్ రివొల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) సంచలన ప్రకటన చేసింది. అమెరికా చేపట్టిన ఈ చర్య పూర్తిగా విఫలమైందని ఇరాన్ సైనిక కమాండ్ పేర్కొంది. ఈ ఆపరేషన్‌లో ఐదుగురు మరణించినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. అయితే, ఈ ఆపరేషన్ చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైందని, తమ పైలట్‌ను విజయవంతంగా రక్షించుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. గత శుక్రవారం ఇరాన్ కూల్చివేసిన తమ ఎఫ్-15ఈ యుద్ధ విమానంలో తప్పిపోయిన రెండో పైలట్‌ను (కల్నల్ ర్యాంక్ అధికారి) సురక్షితంగా కాపాడినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో ఒక్క అమెరికా సైనికుడు కూడా గాయపడలేదని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో పేర్కొన్నారు. శుక్రవారం నాడు మధ్య ఇరాన్‌లో అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ యుద్ధ విమానం కూలిపోయింది. అందులోని ఇద్దరు పైలట్లలో ఒకరిని వెంటనే రక్షించగా, రెండో పైలట్ కోసం అమెరికా ప్రత్యేక దళాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే అమెరికా విమానాలను కూల్చివేశామని ఇరాన్ చెబుతోంది. ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో శత్రు విమానాలు మంటల్లో కాలిపోతున్నాయని ఇరాన్ అధికార ప్రతినిధి తెలిపారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఓ డ్రోన్‌ను కూడా కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ పరస్పర విరుద్ధ ప్రకటనలతో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఇదే సమయంలో మరో అమెరికా యుద్ధ విమానం ఏ-10ను కూడా కూల్చినట్లు వార్తలు వస్తుండటం గమనార్హం.

## ఈసారి సరిహద్దుల్లో కాదు.. నేరుగా కోల్‌కతాపైనే అటాక్ చేస్తం

- మొదటి పేజి తరువాయి

తమ ప్రతిస్పందన సరిహద్దుల వరకే పరిమితం కాదని.. ఇండియా లోపలికి చొచ్చుకెళ్లి మరీ అటాక్స్ చేస్తామని ప్రగల్భాలు పలికారు. ఇండియా ఏదైనా దుందుడుకు చర్యలకు పాల్పడితే ఈసారి తమ టారట?గ్ట్ కోల్?కతా అవుతుందని మతిలేని మాట్లాడారు. భారతీయుల ఇళ్లలోకి చొరబడి చంపేస్తామని బలుపు కూతలు కూశాడు. ఆర్ఎస్ఎస్ క్యాంప్ లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని హెచ్చరించాడు.

భారత నిర్బంధంలో ఉన్న పాకిస్థానీయులతో ఒక 'ఫాల్స్ ఫ్లాగ్' కుట్రకు ఇండియా ప్లాన్ చేస్తోందని నిరాధార ఆరోపణలు చేశాడు. సొంత దేశంలో వారే దాడి చేసుకుని ఆ నిందను ఉగ్రవాదంపై మోపుతారని ఆరోపించాడు. ఖవాజా వ్యాఖ్యలపై ఇండియన్స్ భగ్గుమంటున్నారు. ఇండియాపై దాడి తర్వాత ముందు మీ దేశ ప్రజలకు మూడు పూటలా కడుపు నిండా అన్నం పెట్టడంటూ చురకలంటిస్తున్నారు. మంత్రులకు సరిగ్గా జీతాలు ఇవ్వలేని వారు కూడా యుద్ధాలు చేస్తామంటూ బీరాలు పలుకుతున్నారని సెటైర్లు వేస్తున్నారు. భారత్ చేతిలో ఇప్పటికే ఎన్నోసార్లు చావు దెబ్బతిన్న పాకిస్తాన్?కు బుద్ధి రావడం లేదంటూ విమర్శిస్తున్నారు. ఖవాజా కామెంట్స్ కేవలం వారిలోని భయం, నిస్సహాయతను సూచిస్తోంది. ప్రస్తుతం ఆ దేశం పశ్చిమ సరిహద్దులో ఆఫ్ఘన్ తాలిబన్లతో యుద్ధం చేస్తోంది. దేశంలోనే బలూచిస్థాన్, పంజాబ్, పాక్ ఆక్రమిత కాశ్మీర్లో ప్రజల తిరుగుబాటు తీవ్రస్థాయిలో ఉంది. వీటిని అదుపు చేయలేక, ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కలేక.. ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇండియాను బూచిగా చూపిస్తోంది. ఏ దేశమైనా యుద్ధం చేయాలంటే గుండె ధైర్యంతో పాటు ఖజానాలో డబ్బు కూడా ఉండాలి. మరీ ప్రస్తుతం పాకిస్థాన్ సిట్యూవేషన్ చూస్తే కనీసం తన దేశంలోని మంత్రులకే జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉండి భారీ యుద్ధాన్ని ఎలా కొనసాగిస్తుందన్నదే అతిపెద్ద ప్రశ్న.

# నీటి సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

- మొదటి పేజి తరువాయి

సంరక్షించుకోవాలి, భూగర్భ జలాలను పెంచాలి" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇరిగేషన్, అటవీ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేసి సాగునీటి సంఘాలకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. నీటి భద్రతను సాధిస్తే మిగిలిన అన్ని రంగాల్లో అభివృద్ధి దానంతట అదే సాధ్యమవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

**పక్కా ప్రణాళికతో పనులు.. జులై 14 డెడ్‌లైన్**

ఈ 100 రోజుల కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో అమలు చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్‌ను ప్రకటించింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రణాళికను రూపొందించారు.

ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 వరకు: చేపట్టాల్సిన పనుల గుర్తింపు.

ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 20 వరకు: గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతుల మంజూరు.

ఏప్రిల్ 21 నుంచి జూలై 9 వరకు: క్షేత్రస్థాయిలో పనుల అమలు.

జూలై 10 నుంచి జూలై 14 వరకు: పూర్తి చేసిన పనులపై నివేదికల సమర్పణ.

ఈ షెడ్యూల్ ప్రకారం 'మిషన్ అప్రోచ్'తో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సీఎం అధికారులకు, సాగునీటి సంఘాల సభ్యులకు సూచించారు.

**అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో.. భూగర్భ జలాల పెంపే లక్ష్యం**

నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపులో అన్నమయ్య జిల్లా సాధించిన ప్రగతిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. 'జలధార' పేరుతో ఆ జిల్లాలో చేపట్టిన చర్యలు అద్భుత ఫలితాలనిచ్చాయని, స్థానిక జలవనరులను వినియోగించుకుని, చెరువులను నింపి భూగర్భ జలాలను గణనీయంగా పెంచారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుతం రాష్ట్రంలో సగటున 8.7 మీటర్ల లోతున ఉన్న భూగర్భ జలాలను, కనీసం 1.5 మీటర్ల మేర పైకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

**పూడికతీత నుంచి వాటర్ బడ్జెట్ వరకు.. చేయాల్సిన పనులివే**

ఈ 100 రోజుల్లో చేపట్టాల్సిన పనులపై సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫీడర్ ఛానెళ్లను శుభ్రం చేయడం, చెరువులు, కాల్వల్లో పూడిక తీయడం, గుర్రపు డెక్కను తొలగించడం వంటి పనులను వెంటనే చేపట్టాలన్నారు. దీనివల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, వరద ముంపును కూడా అరికట్టవచ్చని తెలిపారు. అవసరమైన చోట చెక్ డ్యాంలకు మరమ్మతులు చేయడం, కొత్త నిర్మాణాలు చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా, ప్రతి సాగునీటి సంఘం తమ పరిధిలో 'వాటర్ బడ్జెట్' తయారు చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యత, అవసరాలపై స్పష్టమైన అంచనాతో ముందుకు సాగాలన్నారు. నీటి వృధాను అరికట్టేందుకు మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని కోరారు.

**కరవు రహిత రాష్ట్రమే ధ్యేయం.. ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి**

కొద్దిపాటి శ్రద్ధ పెడితే రాష్ట్రంలో నీటి సమస్యను అధిగమించి, కరవు రహిత రాష్ట్రంగా మార్చవచ్చని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాయలసీమ ఎడారి అవుతుందని అన్నారని, కానీ నేడు హార్టీకల్చర్ హబ్‌గా మారిందని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ వంటి ప్రాజెక్టులతో పాటు, నేడు పోలవరం సహా పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు.

గతేడాది (2024 మే నుంచి 2025 మే వరకు) ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు 2.20 మీటర్ల మేర పెరిగాయని, అంటే సుమారు 200 టీఎంసీల నీటిని అదనంగా భూమిలో ఇంకించగలిగామని తెలిపారు. అదే స్ఫూర్తితో ఈ 100 రోజుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# జగన్ పేరు కూడా అలాంటిదే

"గ్రామాల్లో శుభకార్యాల సమయంలో అమంగళకరమైన పేర్లు పలకకూడదని ఒక సంప్రదాయం ఉంటుంది. నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 'జగన్' అనే పేరు కూడా అలాంటిదే" అంటూ రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు చేశారు. రాజధాని అమరావతి విషయంలో జగన్ అనుసరించిన వైఖరి రాష్ట్రానికి తీరని నష్టం చేసిందని, ఆయనొక అభివృద్ధి నిరోధక శక్తి అని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ తన కొత్త రాజధాని ప్రతిపాదనతో రాష్ట్ర ప్రజల ముందు నవ్వులపాలయ్యారని, సొంత పార్టీ శ్రేణులే ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయని అన్నారు.

**జగన్... రాష్ట్రానికి పట్టిన చీడ**

రాష్ట్రానికి రాజధాని నిర్మాణం ఒక గొప్ప సంబరం లాంటిదని, అలాంటి సమయంలో జగన్ 'కంటిలో నలుసులా', 'రాష్ట్రానికి పట్టిన చీడపీడలా' తయారయ్యారని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు తెలిపితే, ఒక్క వైసీపీ మాత్రమే పార్లమెంటులో వాకౌట్ చేసి రాష్ట్ర ప్రయోజనాలకు గండికొట్టిందని గుర్తుచేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాల్సిన రాజధాని విషయంలో జగన్ వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని విమర్శించారు. ఆయన పాలనలో రాష్ట్రం ఐదేళ్ల పాటు చీకటి రోజులను చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**వికేంద్రీకరణ పేరుతో చారిత్రక తప్పిదం**

2019-24 మధ్య జగన్ చెప్పిన 'అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదం శుద్ధ అబద్ధమని పార్థసారథి స్పష్టం చేశారు. "అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు ప్రకటించి, అధికారంలోకి రాగానే మాట మార్చారు. సూట్‌కేసు రాజకీయాలు చేస్తూ రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారు. ప్రజలు ఈ నాటకాన్ని గమనించి, మూడు రాజధానుల ఆలోచనను ఛీత్కరించి కేవలం 11 సీట్లకు పరిమితం చేశారు" అని ఎద్దేవా చేశారు.

చేసిన తప్పులను ఒప్పుకోకుండా, ప్రజల అభిప్రాయాన్ని గౌరవించకుండా తన ఆలోచనలనే రుద్దే నియంతలా జగన్ వ్యవహరించారని మండిపడ్డారు. రాజధాని పేరును 'మావిగన్'గా మార్చాలని చూడటం ఆయన 'తుగ్లక్' పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

**అమరావతి.. ఐదు కోట్ల మంది ఆత్మగౌరవం**

విభజనతో నష్టపోయిన ఆంధ్రులకు అమరావతి ఒక ఆత్మగౌరవ ప్రతీక అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. "ఏ నాయకుడూ చేయలేని సాహసాన్ని చంద్రబాబు చేశారు. ఆయన ఒక్క పిలుపుతో రైతులు 34,000 ఎకరాల విలువైన భూములను రాజధాని కోసం త్యాగం చేశారు. అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్'. ఈ రోజు హైదరాబాద్ తెలంగాణకు లక్షల కోట్ల ఆదాయాన్ని అందిస్తోంది. అదే స్థాయిలో అమరావతి అభివృద్ధి చెందితే, ఏటా వచ్చే 4-5 లక్షల కోట్ల ఆదాయంతో రాష్ట్రంలోని ప్రతీ మూలను అభివృద్ధి చేయవచ్చు" అని వివరించారు. అమరావతిలో పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ అని ఆయన స్పష్టం చేశారు.

**కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు**

గత 20 నెలల కూటమి పాలనలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టిందని పార్థసారథి తెలిపారు. వైసీపీ ప్రభుత్వం సాధించలేకపోయిన

వేల కోట్ల రూపాయల కేంద్ర నిధులను సాధించి ప్రజా సంక్షేమానికి వినియోగిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించి సమగ్రాభివృద్ధి చేస్తున్నామన్నారు. కర్నూలుకు కారిడార్, ప్రకాశం-నెల్లూరు జిల్లాల్లో పోర్టులు, రిఫైనరీ, విశాఖను డేటా సెంటర్, సాఫ్ట్‌వేర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

"పెట్టుబడిదారులు వసతులు, కనెక్టివిటీ ఉన్న చోటుకే వస్తారు. జగన్‌లా 'చెట్టు కింద కూర్చుని చర్చలు జరపండి' అంటే ఎవరూ రారు" అని ఆయన ఎద్దేవా చేశారు. అప్పులు తెచ్చినా, సంపద సృష్టించి వాటిని తీర్చే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందని, జగన్ ఇప్పటికైనా అబద్ధాలు మాని వాస్తవాలు గ్రహించాలని హితవు పలికారు.

## కడప జిల్లాలో కాలి బూడిదైన ఆర్టీసీ బస్సు... తప్పిన పెను ప్రమాదం

వైఎస్ఆర్ కడప జిల్లాలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఓ ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగగా, డ్రైవర్ వేగంగా స్పందించడంతో అందులో ఉన్న 21 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన వేంపల్లి మండలం వీరన్నగట్టుపల్లి సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, కదిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 21 మంది ప్రయాణికులతో వేంపల్లి నుంచి కదిరికి బయలుదేరింది. వీరన్నగట్టుపల్లి వద్దకు రాగానే, రోడ్డుకు అడ్డంగా తక్కువ ఎత్తులో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు బస్సు పైభాగానికి తగిలాయి. దీంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. బస్సు లోపల పొగలు, మంటలు గమనించిన ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. ప్రయాణికులందరినీ హుటాహుటిన కిందకు దించారు. వారు దిగిన కొద్దిసేపటికే మంటలు బస్సు మొత్తానికి వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే, అప్పటికే బస్సు కాలి బూడిదైంది.

విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడటమే ఈ దుర్ఘటనకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై వేంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# బాసరకు మహర్దశ...రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయ పునరుద్ధరణ

- మొదటి పేజి తరువాయి

ప్రాశస్త్యం ఉన్న ఆలయ అభివృద్ధి పనులను అత్యంత శ్రద్ధతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. పునఃనిర్మాణ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ముందు అధికారులు శృంగేరి వెళ్లి పీఠాధిపతుల ఆశీస్సులు, అనుమతులు తీసుకున్నారు. గర్భాలయం, రాజగోపురం, మాడ వీధులు, కోనేరు వంటి నిర్మాణాలపై వారి సూచనలను స్వీకరించి, వాటికి అనుగుణంగా ప్రణాళికను ఖరారు చేశారు. సంప్రదాయాలకు, భక్తుల విశ్వాసాలకు ఎలాంటి భంగం కలగకుండా పనులు జరగాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

**మూడు రెట్లు పెరగనున్న ఆలయ విస్తీర్ణం**

ఏటా లక్షలాది మంది చిన్నారులకు అక్షరాభ్యాసం జరిగే ఈ క్షేత్రానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. ప్రస్తుత ఆలయం ఇరుకుగా ఉండటంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆలయాన్ని భారీగా విస్తరించనున్నారు. ప్రస్తుతం 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆలయ ప్రాంగణాన్ని ఏకంగా 62 వేల చదరపు అడుగులకు పెంచనున్నారు. అంటే ఆలయం మూడు రెట్లు విశాలం కానుంది. ఇందులో భాగంగా 2 వేల చదరపు అడుగుల గర్భాలయం, అర్ధమండపాన్ని 5 వేల చదరపు అడుగులకు విస్తరిస్తారు.

**శిలామయంగా... సకల సౌకర్యాలతో...**

పునఃనిర్మాణంలో భాగంగా ఆలయంలోని ప్రతి నిర్మాణం శాశ్వతంగా ఉండేలా శిలలతో చేపట్టనున్నారు. ఉత్తర దిక్కున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అంతస్తుల గోపురాలు నిర్మిస్తారు. ఆలయం చుట్టూ 33 అడుగుల

వెడల్పుతో మాడ వీధులు ఏర్పాటు చేస్తారు. ఈశాన్య దిక్కున పవిత్ర కోనేరు, తూర్పున ఆధ్యాత్మిక శోభతో తోరణాలు నిర్మిస్తారు. దాదాపు 6 వేల మంది భక్తులు వేచి ఉండేలా 70 వేల చదరపు అడుగులలో క్యూ కాంప్లెక్సులు, 200 మంది ఏకకాలంలో ధ్యానం చేసుకునేందుకు ధ్యాన మందిరం, విశాలమైన వంట, భోజనశాలలు, ప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

**పుష్కరాల నాటికి భక్తులకు సౌకర్యాలు**

వచ్చే ఏడాది జూన్‌లో గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. ఆ సమయంలో లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానాల కోసం బాసరకు తరలివస్తారు. వారిని దృష్టిలో ఉంచుకొని ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. భక్తుల సౌకర్యార్థం దేవాలయం నుంచి మరోవైపు వెళ్లేందుకు అండర్‌పాస్, సోలార్ రూఫ్‌టాప్‌తో కూడిన వాహనాల పార్కింగ్, ఆలయ ప్రాంగణంలో పుష్పవనం, హెల్త్ సెంటర్ వంటివి కూడా ఈ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఉన్నాయి. ఈ పనులతో బాసర క్షేత్రం దేశంలోనే ఒక అద్భుతమైన పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకోనుంది.

## హర్మ్యూజ్ జలసంధి తెరవకపోతే పవర్ ప్లాంట్ డే, బ్రిడ్జ్ డే రెండూ ఒకేసారి చూస్తారు

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. హర్మ్యూజ్ జలసంధి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు నేరుగా, కఠినమైన హెచ్చరిక జారీ చేశారు. హర్మ్యూజ్ ను ఇప్పటికైనా తెరవకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. "ఇరాన్‌లో మంగళవారం నాడు పవర్ ప్లాంట్ డే, బ్రిడ్జ్ డే రెండూ ఒకేసారి ఉంటాయి.

అలాంటిది ఎప్పుడూ చూసి ఉండరు" అని ట్రంప్ తన పోస్ట్‌లో రాశారు. "హర్మ్యూజ్ జలసంధిని తెరవండి, లేదంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటారు. మీరే చూస్తారు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఇరాన్ కు ట్రంప్ 48 గంటల డెడ్ లైన్ విధించిన సంగతి తెలిసిందే. అయితే, ట్రంప్ దూకుడు వైఖరిపై సొంత దేశంలోనే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ యుద్ధం వల్ల దేశం మరో సుదీర్ఘకాల సంక్షోభంలోకి జారుకుంటోందని మేరీల్యాండ్ గవర్నర్ వెస్ మూర్ ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఎస్ న్యూస్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, "మనం ప్రమాదకరంగా మరో శాశ్వత యుద్ధంలోకి వెళుతున్నాం. అసలు మన లక్ష్యం ఏంటో, ఏ లక్ష్యం సాధిస్తే విజయం అనాలో ఎవరికీ స్పష్టత లేదు" అని అన్నారు. ఈ యుద్ధం వల్లే గ్యాస్ ధరలు డాలర్‌కు పైగా పెరిగాయని, ఇది ప్రజలపై భారం మోపుతోందని ఆయన తెలిపారు.

మరోవైపు, అమెరికా బలగాలకు సేవలందించే క్యాథలిక్ చాప్లిన్‌ల పర్యవేక్షకుడు, ఆర్చ్‌బిషప్ తిమోతి బ్రోగ్లియో ఈ యుద్ధానికి నైతిక సమర్థన లేదని స్పష్టం చేశారు. "ధర్మబద్ధమైన యుద్ధ సిద్ధాంతం (జస్ట్ వార్ థియరీ) ప్రకారం ఇది సరైంది కాదు. ముప్పు పూర్తిగా ఏర్పడక ముందే మనం స్పందిస్తున్నాం" అని అన్నారు. ఈ ఘర్షణలో అమాయక పౌరులు, సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధానికి మతపరమైన రంగు పులమడం సరికాదని, ఏసు ప్రభువు శాంతి సందేశాన్ని ఇచ్చారని గుర్తుచేశారు.

# ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి...

భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. పాలనా సౌలభ్యం, స్థానిక గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈ విలీనం అత్యవసరమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తుమ్మల వివరించారు. ఈ గ్రామాలను భద్రాచలంలో విలీనం చేయడం ద్వారా గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ అంశంపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనానికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి, సానుకూలంగా స్పందించాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## సన్‌రైజ్ హాస్పిటల్స్ ఎండీ కుమారుడి పెళ్లి రిసెప్షన్ కు లోకేశ్ హాజరు...

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలో జరిగిన ఓ వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరయ్యారు. విజయవాడకు చెందిన సన్‌రైజ్ హాస్పిటల్స్ ఛైర్మన్, ఎండీ డాక్టర్ మాదాల నరేంద్ర కుమార్ తనయుడి వివాహ రిసెప్షన్‌లో ఆయన పాల్గొన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఈ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి లోకేశ్, నూతన వధూవరులు సాయి శిశిర్, వైష్ణవిలను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని లోకేశ్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. వధూవరులతో కలిసి దిగిన ఫొటోలను పంచుకుంటూ, "విజయవాడ సన్ రైజ్ హాస్పిటల్స్ ఎండీ, ఛైర్మన్ డాక్టర్ మాదాల నరేంద్ర కుమార్ గారి తనయుడి వివాహ రిసెప్షన్‌కు హాజరై నవ దంపతులు సాయి శిశిర్, వైష్ణవిలను ఆశీర్వదించాను" అని తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, రిసెప్షన్ వేదిక వద్ద లోకేశ్ రాకతో కోలాహలం ఓ రేంజిలో నెలకొంది. పెళ్లికి వచ్చినవాళ్లు లోకేశ్ తో సెల్ఫీలకు పోటీ పడ్డారు. లోకేశ్ నవ్వుతూ ఓపిగ్గా సెల్ఫీలు ఇచ్చారు.

## జగన్ దీనికేమని సమాధానం చెబుతారు?

- మొదటి పేజి తరువాయి

ఖర్చుతో పోలుస్తూ ఆయన కొన్ని సంచలన లెక్కలను బయటపెట్టారు. "ఆంధ్రుల కోసం కడుతున్న రాజధానికి చదరపు అడుగుకి రూ.12,000 అవుతుందని జగన్ అబద్ధాలు చెబుతున్నారు. అలాంటప్పుడు తన విలాసాల కోసం కట్టిన రుషికొండ ప్యాలెస్‌కు ఇంత భారీగా ఎందుకు ఖర్చు చేశారు? దీనికి జగన్ ఏం సమాధానం చెబుతారు?" అని కన్నా లక్ష్మీనారాయణ నిలదీశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, రాజధాని విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అమరావతి నిర్మాణానికి చదరపు అడుగుకు అయ్యే ఖర్చు కేవలం రూ.6,985 మాత్రమేనని కన్నా పేర్కొన్నారు. అదే సమయంలో, జగన్ తన సొంత విలాసాల కోసం కట్టించుకున్న రుషికొండ ప్యాలెస్‌కు చదరపు అడుగుకు రూ.35,714 ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు. ఈ వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. అంతేకాదు, పోలిక కోసం ఆయన తెలంగాణ కొత్త సచివాలయానికి చదరపు అడుగుకు రూ.6,500, ఢిల్లీలోని కొత్త పార్లమెంటు భవనానికి రూ.17,291 ఖర్చయిందని వివరించారు.

# తవ్వే స్తున్నారు.. మండలంలోని మైనింగ్ మాఫియా



**సీతానగరం, పెన్ పవర్, ఏప్రిల్ 5:**మండలంలోని సీతానగరం కైలాసగిరి ర్యాంపు నుండి మైనింగ్ మాఫియా రెచ్చిపోతుంది. పగలు రాత్రి తేడా లేకుండా అక్రమంగా మట్టి త్రవ్వకాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. మైనింగ్ రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. నల్గొండ పరిసర ప్రాంతాల్లో కూడా అక్రమంగా ఎర్ర గ్రావెల్ త్రవ్వకాలు వ్యవహారం స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కొందరు అధికార పార్టీ నాయకుల అండతోనే మైనింగ్ మాఫియా దూకుడుగా వ్యవహరిస్తుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో మునిగి అక్రమాలకు సహకరిస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా ఫిర్యాదులు మీడియా కథనాలపై కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి అక్రమ మట్టి ఎర్ర గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# కనుపూరు గ్రామంలో 119 వ బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు..



**కోరుకొండ,పెన్ పవర్, ఏప్రిల్ 5;** కనుపూరు గ్రామంలో బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కోరుకొండ ఎస్సై అంకారావు మరియు మంచాల సామెల్ బాబు జగజ్జీవన్ రాయ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచాల సామేలు మాట్లాడుతూ సమాన హక్కులు, సామాజిక న్యాయం ,సమగ్ర అభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేశారని అన్నారు. ఆయన చూపిన మార్గం నేటి నాయకులకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎస్సై అంకారావు, కమిటీ సభ్యులు గ్రామస్తులు కూటమి నాయకులు పాల్గొన్నారు

## బాబు జగజ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలు..



**ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి,అడపా శ్రీనివాస్..**

**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రిల్ 5:** బాబు జగజ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, అడపా శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించి కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ జీవితాంతం దళిత, బహుజనుల హక్కుల కోసం సమ సమాజ నిర్మాణం కోసం పాటుపడిన సమతామూర్తి, దేశం గర్వించదగిన గొప్ప పాలనాదక్షులు, భారత తొలి ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ అని తెలిపారు. అటువంటి మహనీయుడి జయంతి వేడుకలు పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని వెంకటలక్ష్మి అన్నారు.

ఈ కార్యక్రమంలో వంక మల్లిబాబు, వేగిశెట్టి రాజు, జనసేన తెలుగుదేశం బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ప్రకాష్ ను సత్కరించిన పార్ట్ సభ్యులు.



**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 5.** మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన బొనిగే నిఖి ప్రకాష్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. కొవ్వూరు ప్రత్యేక కోర్టు జడ్జి అయిన బోనిగే వెంకట్రావు కు ప్రకాష్ కుమారుడు. ఆయన ప్రాథమిక విద్యభ్యాసం చిట్యాల గ్రామాల్లోని జరిగింది. అనంతరం ఎల్.ఎల్.బి విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఎల్ ఎల్ ఎం రాజమహేంద్రవరంలోని నన్నయ్య యూనివర్సిటీలో చదువుకున్నారు. తరువాత ఆంధ్ర హైకోర్టు ఆధ్వర్యంలో జరిగిన ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలను వ్రాయగా ఏప్రిల్ రెండో తేదీన ఫలితాలు విడుదలయ్యాయి. ప్రకాష్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కు ఎంపికైనట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రగతి అసోసియేషన్ పర్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ సభ్యులు తమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బేతాళ వీరస్వామి ఆదేశాల మేరకు ప్రకాష్ ను కలిసి అభినందించారు. సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ తాను కష్టపడి చదవడం ద్వారానే ఈ విజయాన్ని అందుకున్నానన్నారు. తన మాతృమూర్తి బొనిగే గంగాభవాని ఆశయం మేరకు తాను ఈ న్యాయ వ్యవస్థ లోనికి రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్ధు ఇండియాసంస్థ సభ్యులు దొడ్డిగర్ల వెంకటేష్, చింతలపూడి భాస్కరరావు, వింజమూరి సుబ్బారావు, మోసాల కొండలరావు, పాముల తిరుపతిరావు, జేమ్స్ తదితరులు ప్రకాష్ ను సత్కరించిన వారిలో ఉన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగజ్జీవన్ రామ్

**ఎమ్మెల్యే మద్దిపాటి.**





**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 5.** దేశంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన మహోన్నతమైన వ్యక్తి మాజీ ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ అని స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు కొనియాడారు. మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ద్వారకతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాలలోని ఆయా గ్రామాల్లో జరిగిన జయంతి వేడుకలకు ఎమ్మెల్యే మద్దిపాటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద దళిత వర్గాల్లో పుట్టి విద్య ద్వారా ఎంతో ఉన్నతమైన స్థితికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్ లు చేరుకున్నారన్నారు. ఆనాటి సమాజంలో ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ వీరు వాటిని అధిగమించి నవ సమాజ నిర్మాణం, సమానత్వం వంటి వాటి కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. జగజ్జీవన్ రామ్ గొప్ప రాజకీయవేత్తగా సుదీర్ఘకాలం పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రిగా పనిచేశారనీ గుర్తు చేశారు. సమన్యాయం కోసం పోరాటం చేశారన్నారు. అటువంటి వ్యక్తి యొక్క జయంతి వేడుకలను దేవరపల్లి మండలం పల్లంట్ల, కురుకూరు గ్రామాలలోని యూత్ సభ్యులు వినూత్నమైన రీతిలో ఈ వేడుకలు జరిపారని అభినందించారు జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేసి నూతన ఓరవడికి శ్రీకారం చుట్టారని యూత్ సభ్యులను అభినందించారు. అనంతరం అంబేద్కర్ జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ద్వారకా తిరుమల మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆ గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గోపాలపురం మండలం వేళ్ళ చింతల గూడెం గ్రామంలో జరిగిన వేడుకలకు హాజరై కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అలాగే స్థానిక పెద్దగూడెం లో ఉన్న జగత్ జీవన్ రామ్ విగ్రహం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేళ్ళ చింతల గూడెం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొర్లపాటి రాము ప్రముఖ సంఘ సేవకులు గంటా మధు కృష్ణ కొర్లపాటి అన్నవరం నూతంగి దొరబాబు స్థానిక నాయకులు బాబు జగజీవన్ రామ్ యూత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం మండలంలోని గుడ్డిగూడెం గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నాయకులతో పాల్గొన్నారు

# న్యాయ శాస్త్రంలో పట్టా పొందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు.




**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 5.** ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గొప్ప ఘనత సాధించడం సామాన్యమైన విషయం కాదు అని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన బొనిగే వెంకట్రావు కుటుంబం గొప్ప మైలురాయిని చేరుకుందని చెప్పవచ్చు. వివరాల్లోకెళ్తే అత్యంత సామాన్యమైన కుటుంబం నుంచి వచ్చిన వెంకట్రావు బాల్యం నుండి కష్టపడి చదువుకున్నారు. న్యాయ శాస్త్రం చదివిన ఆయన ఇటీవల కొవ్వూరు ప్రత్యేక కోర్టుకు జడ్జిగా నియమితులయ్యారు. అయితే తండ్రిని ఆదర్శంగా తీసుకోవడంతోపాటు తల్లి గంగాభవాని ఆశయం మేరకు వారి సంతానం అయిన కుమార్తె సోఫియా, కుమారుడు ప్రకాష్ ఆ మార్గంలోని పయనించారు. ప్రకాష్ ఆంధ్ర యూనివర్సిటీలో ఎల్.ఎల్.బి పూర్తి చేసి అనంతరం రాజమహేంద్రవరంలోని నన్నయ యూనివర్సిటీలో ఎల్ ఎల్ ఎం అభ్యసించారు. ఇటీవల ఆంధ్ర హైకోర్టు ఆధ్వర్యంలో జరిగిన న్యాయ వ్యవస్థ కు సంబంధించిన సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యారు. కుమార్తె సోఫియా సైతం ఎల్.ఎల్.బి పూర్తి చేశారు. అయితే మారుమూల గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఈ ముగ్గురు న్యాయ శాస్త్రాన్ని అభ్యసించి పలువురికి ఆదర్శప్రాయంగా నిలిచారు. అత్యంత చిన్నవయసులోనే వీరు ఈ ఘనత సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలుపుతున్నారు. నేటి సమాజంలోని యువత ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచిస్తున్నారు. ఏది ఏమైనా ఒకే కుటుంబానికి చెందిన తండ్రి కొడుకులు న్యాయవ్యవస్థకు సంబంధించిన అరుదైన అవకాశాలను సొంతం చేసుకోవడం పట్ల అభినందనలు తెలుపుతున్నారు. ఇటువంటి సంఘటనలు జరగడం అరుదు అని పలువురు కొనియాడుతున్నారు. కాబట్టి ఇటువంటి వారి సలహాలతో యువత చదువుల్లో రాణించాలని ఆశిస్తున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కొత్తగా వేస్తున్న రోడ్డుపై ఇసుక లారీలను తిరగనివ్వం.గ్రామస్తులు ఆగ్రహ వ్యక్తం.

**సీతానగరం, పెన్ పవర్, ఏప్రిల్ 5:**కొత్త రోడ్డు పై ఇసుక లారీలు రావొద్దని మండలంలోని సింగవరం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సింగవరం ఏటిగట్టు గత రెండు నెలల నుండి రహదారి పూర్తిగా పనులు ప్రారంభించి తారు రోడ్డు వేశారు. వేసిన రోడ్డు మీద సింగవరం ఇసుక ర్యాంపు యాజమాన్యులు మనల్ని ఎవడ్రా ఆపేది అనే రీతిలో భారీ వాహనాలతో ఇసుక తరలించడంతో రోడ్డు దెబ్బతింటుంది అని గ్రామస్తులు వాహనదారులు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు నియమాలు పాటించకుండా అధిక లోడుతో లారీలు తిరిగితే రోడ్డుపై లారీలను నిలిపివేస్తామని అవసరమైతే రాస్తారోకో చేస్తామని అన్నారు. ఆర్ అండ్ బి అధికారులు ఈ రహదారిపై సుమారు 20 రోజుల వరకు ఇసుక లారీలకు అనుమతి లేకుండా చేయాలని గ్రామస్తులు తెలిపారు.



# కొంప ముంచిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్..



* బాధితులకు అండగా ఉంటామన్న ఎమ్మెల్యే శిరీషాదేవి.
* నిత్యావసర సరుకులు, బియ్యం అందించిన ఎమ్మెల్యే..

**అడ్డతీగల ,పెన్ పవర్, ఏప్రియల్ 05;**విద్యుత్ షార్ట్ సర్క్యూట్ పేదల పాలిట శాపంగా మారింది. అందరూ ఈస్టర్ పండుగ వాతావరణంలో ఉంటే ఆ కుటుంబాలను విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నిరాశ్రయులను చేసింది. వివరాల్లోకి వెళితే అడ్డతీగల మండలం కోనలోవ గ్రామంలో నిరుపేదల తాటాకు ఇళ్లపై విద్యుత్ షార్ట్ సర్క్యూట్ రూపంలో ఆ కుటుంబాలకు చీకటి మిగిల్చింది. కోనలోవ గ్రామానికి చెందిన చెవ్వేటి. రత్నమ్మ, దూలపల్లి. మార్తమ్మ, ఎల్లబెల్లి. వెంకటేశులు, కొమ్ముకూరి. సూర్యకాంతం లకు చెందిన తాటాకు గృహాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఆదివారం ఉదయం ప్రమాదానికి గురయ్యాయి. దీనితో ఆయా కుటుంబాలు కట్టుబట్టలతో వీధిన పడ్డారు. విషయం తెలుసుకున్న రంప చోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల. శిరీషాదేవి హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడిన ఆమె వారి బాధను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి, జరిగిన నష్టంపై క్షుణ్ణంగా ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ బాధితులకు తన స్వంత ఖర్చులతో నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. ప్రభుత్వం ద్వారా కూడా నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ రూపంలో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సదరు విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక , రెవెన్యూ సిబ్బందికి సమచారం అందించగా, వారు వచ్చి మంటలు అదుపులోకి తీసుకు రావటానికి ప్రయత్నం చేశారు. అప్పటికే పూర్తిగా గృహాలు కాలిపోవటంతో బాధితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రమాదంలో గృహాలు పూర్తిగా కాలిపోయాయి ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లక పోవటంతో అధికారులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు . బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే శిరీష దేవి భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బుర్లె .హరిబాబు, అడ్డతీగల మండలం పార్టీ నాయకులు ఎడ్ల. శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షులు సాకేటి. రాజు, రాజవొమ్మంగి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాసం శెట్టి. గంగాధర్, తెదేపా సీనియర్ నాయకులు గణజాల. తాతారావు, అడ్డతీగల జనసేన నాయకులు పొడుగు. సాయి , బండారు కృపమ్మ, బేలెం. రాఘవ, పాలేటి. అబ్రహం, కొసనం. సురేష్, తెదేపా యువజన విభాగం ప్రతినిధి కంభం. ప్రమోద్, కంటపురెడ్డి .వీరబాబు, వేమగిరి అర్జున్, అడ్డతీగల వా× వినోద్, వీఆర్వో పుడిగి .జాన్, పద్మ, రాజేశ్వరి అధిక సంఖ్యలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న 108 సిబ్బంది





**వై రామవరం, పెన్ పవర్, ఏప్రిల్ 5 :** చెట్టు నుండి పడిన వ్యక్తి గాయపడిన సమాచారం తెలియగానే హుటా హుటిన సంఘటన స్థలానికి కాలినడకన చేరుకున్న 108 సిబ్బంది ప్రధమ చికిత్స అందించిన సేవలు ప్రశంసనీయమని పలువురు కొనియాడుతున్నారు.

వివరాల్లోనికి వెళితే వై.రామవరం మండలం పి.ఎర్రగొండ పంచాయతీ తాడికోట గ్రామానికి చెందిన చోళ్ళ చిన్నారెడ్డి(20) చెట్టు నుండి పడి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో సుమారు ఐదు కిలోమీటర్ల మేర డోలి కట్టుకొని 108 సిబ్బంది సహకారంతో గ్రామస్తులు అంబులెన్స్ వరకు ఏడు వాగులు దాటుకొని క్షత గాత్రుని మోసుకుని వచ్చారని తెలిపారు. ఆపద కాలంలో ఆదుకునే 108 భవ్య హెల్త్ సర్వీస్ సంస్థ ఎప్పుడు ప్రజల ప్రాణాలు కాపాడే దృక్పథంతో పనిచేస్తుందనడానికి ఇదే నిదర్శనం అని పలువురు కొనియాడుతున్నారు. పైలట్ నవాజ్, ఈఎంటి వెంకట్ గ్రామస్తులు సహకారంతో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని తెలిపారు.

## ఉరుములు మెరుపులు ఈదురు గాలులతో భారీ వర్షం



**వై రామవరం, పెన్ పవర్, ఏప్రిల్ 5 :** మండలంలో ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో భారీ వర్షం ఆదివారం మధ్యాహ్నం కురిసింది.

ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల మామిడి జీడి మామిడి తోటలకు ఉపయోగ ఉంటుందని రైతులు అంటున్నారు. నిత్యం మండలంలో ఏదో ఒక ప్రాంతంలో వర్షం కురుస్తూనే ఉందని రైతులంటున్నారు. ఈ వర్షాల వల్ల వేసవి తాపం నుండి ఉపశమనం కలుగుతుందని పలువురు అంటున్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగజ్జీవన్ రామ్



**సీతానగరం, పెన్ పవర్, ఏప్రియల్ 5:**అనగారిన వర్గాల అభ్యు న్నతికి పాటుపడిన మహ నీయుడు, పేదల ఆశా జ్యోతి మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ అని రాజానగరం మాజీ ఎమ్మె ల్యే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా పేర్కొన్నారు. సీతానగరం మండలంలోని ఇనగంటి వారి పేట, మిర్తిపాడు గ్రామాల్లో నిర్వహించిన బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొ న్నారు. జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.స్థానిక వైఎస్ఆ ర్సిపి నాయకులు, దళిత సంఘాల నాయకులు, మహిళలు మేళ తాళాలతో రాజాకు ఘన స్వాగతం పలికారు.దారి వెంబడి పూలు జల్లుకుంటూ సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా రాజామాట్లాడుతూ మహనీ యుడు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో తనను భాగస్వామ్యాని చేయడం ఆనందంగా ఉందన్నారు.

దేశంలో అనేక సంస్కరణ ద్వారా పేద ప్రజలకు మేలు చేకూర్చిన మహోన్నత వ్యక్తి జగజ్జీవన్ రామ్ అని కొనియాడారు. నేటి యువత ఆయన అడుగుజాడల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా రాజా కేక్ కట్ చేశారు. గ్రామంలో పేదలకు అన్నదానం చేశారు. రాజా కొద్దిసేపు పేదలకు భోజనం వడ్డించారు.మిర్తిపాడు లో జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం రాజా చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు మహిళలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## “శ్రీ గురుభ్యో నమః” సాక్షిగా గురుశిష్య బంధానికి మహోత్సవం...



**పెన్ పవర్ -- నిడమర్రు మండలం (చిన్న నింద్రకొలను)**

చిన్న నింద్రకొలను గ్రామంలో కీర్తిశేషులు మాజీ మంత్రి చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద్ మూర్తి రాజు గారి విద్యా సేవలకు ప్రతీకగా స్థాపించిన లాల్ బహదూర్ శాస్త్రి ప్రాచ్య కళాశాల (1967--1994) పూర్వ విద్యార్థులు -- ఆచార్యుల అపూర్వ సమ్మేళనం అద్భుతంగా, భావోద్వేగభరితంగా జరిగింది.

గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద “శ్రీ గురుభ్యో నమః” అనే పవిత్ర శీర్షికతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉంగుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే ధర్మరాజు పూర్వ విద్యార్థులు, ఆచార్యులతో కలిసి గ్రామంలో కాలినడక ర్యాలీ నిర్వహించారు. గ్రామ వీధుల గుండా సాగిన ఈ ర్యాలీ ఆత్మీయత, అనుబంధాన్ని చాటింది.

అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, విద్యా దాత చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదనంతరం సభా వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆనాటి ప్రధానాచార్యులు, ఆచార్యులు, అలాగే ఈ కళాశాలలో విద్యనభ్యసించి నేడు వివిధ రంగాలలో ఉన్నత స్థానాలకు ఎదిగిన పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పూర్వ విద్యార్థుల్లో వివిధ కారణాలతో మృతి చెందిన వారికి సభలోని అందరూ నిలబడి నివాళులు అర్పించారు.

ఎమ్మెల్యే ధర్మరాజు ప్రసంగం...

ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆశయాల మార్గంలో నడిచి సమాజ అభ్యున్నతికి విశేష సేవలందించిన విద్యా సేవకుడు చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు గారి సేవలను కొనియాడారు. విద్య అనేది కేవలం పాఠ్యాంశాల పరిమితిలోనే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి బలమైన ఆధారమని పేర్కొన్నారు.

1967--94 మధ్య ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించడం ఆచార్యుల అంకితభావానికి నిదర్శనమని అన్నారు. పూర్వ విద్యార్థులు -- గురువులు ఒకే వేదికపై కలుసుకుని ఇంత గొప్ప సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

ముఖ్య విజ్ఞప్తులు...

ఈ సందర్భంగా పూర్వ ఆచార్యులు, విద్యార్థులు కలిసి లాల్ బహదూర్ శాస్త్రి ప్రాచ్య కళాశాలను తిరిగి పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

అదేవిధంగా నిడమూరు మండలం పెద నింద్రకొలను గ్రామంలోని గాంధీభవన్‌ను ప్రభుత్వాధీనంలోకి తీసుకుని, దానిని మ్యూజియం మరియు విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై ఎమ్మెల్యే ధర్మరాజు సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

గురుశిష్య బంధాన్ని మరోసారి సజీవం చేసిన ఈ సమ్మేళనం అందరికీ చిరస్మరణీయంగా నిలిచింది.

కార్యక్రమంలో పాల్గొన్నవారు...

ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఏ.కే. ప్రభాకర్ రావు (రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్),
డాక్టర్ తిరుమలాచార్యులు (కాలేజీ ప్రిన్సిపల్),
సూరం శ్రీనివాసులు (భాగవతం వ్యాఖ్యాత),
పట్టాభి రామారావు,
ప్రముఖ కవి రచయిత ప్రసాదమూర్తి,
జి. నాగేశ్వరరావు, పి. మాణిక్యం,
పూర్వ విద్యార్థులు మరియు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 5;** డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ దేశానికి గొప్ప సేవలు అందించిన మహానీయుడు అని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ఆదివారం దర్భ గూడెం గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన హక్కులు, సామాజిక న్యాయం ,సమగ్ర అభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేశారని అన్నారు. ఆయన సూపిన మార్గం నేటి నాయకులకు ఆదర్శమని అన్నారు . ఈ కార్యక్రమంలో అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షులు కలపాల రాము, ఉపాధ్యక్షులు ఆల్లె సూర్య ప్రకాష్, కార్యదర్శి కలపాల నరేష్ ,జగజ్జీవన్ రామ్ యూత్ అధ్యక్షులు ఆదూరి రాంబాబు, ఉపాధ్యక్షులు అల్లే సూరి, కార్యదర్శి జాల రాజు, కుమ్మరపల్లి ప్రకాష్, దాసరి కన్నయ్య, దాసరి భద్రయ్య, తదితర సంఘ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రేస్ మందిర్ లో ఘనంగా ఈస్టర్ వేడుకలు




**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 5 ;** ప్రపంచంలోనే క్రైస్తవ మానవాళి అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగ ఈస్టర్ పండుగని గ్రేస్ మందిర్ వ్యవస్థాపకులు పాస్టర్ బి ఎజ్రా శాస్త్రి, నిర్మల శాస్త్రీలు అన్నారు. జీలుగుమిల్లిలో ఆదివారం గ్రేస్ మందిర లో ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణించి మూడు దినములు సమాధిలో ఉండి మరల ఈ దినం మృత్యుంజయుడుగా తిరిగి లేచాడని క్రైస్తవ విశ్వాసుల నిరీక్షణ ఈ ఈస్టర్ పండుగ లో దాగి ఉందని అన్నారు. ఏసుక్రీస్తు మతం కాదని మార్గం అని అన్నారు. దేశంలోనీ నాయకుల , శాంతి సమాధానం కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు .అదేవిధంగా మండలంలోని పలు దేవాలయాలలో క్రైస్తవులు ఘనంగా ఈస్టర్ పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ మందిర్ ఐదు సంఘాల పెద్దలు, విశ్వాసులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కామ్రేడ్ ఎస్ ఎస్ ప్రసాద్ మనలో లేక పోవటం చాలా బాధకారం



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 05.**బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రిటైర్డ్ బ్యాంకు ఆఫీసర్ కీర్తిశేషులు కామ్రేడ్ ఎా ఎా ప్రసాద్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మానవతా అధ్యక్షులు రాజేంద్ర కుమార్ యెగ్గినశరత్ ఆంజనేయ స్వామి లింగంపల్లి గాంధి తదితరులు నివాళులు అర్పించారు. బ్యాంక్ ఉద్యోగుల ఆశయాల పై పోరాటాలపై ఎక్కువ గా పాల్గొన్నవారు అన్నారు.

## జేగురుపాడు పంచాయతి ప్రజాప్రతినిధులకు సత్కారం



**రాజమమహేంద్రరం, పెన్ పవర్, ఏప్రిల్ 5:** అయిదు సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న కడియం మండలం జేగురుపాడు గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని ఘనంగా సత్కరించారు. పంచాయతీ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసరావు ఆద్వర్యంలో సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్,వార్డు సభ్యులను పదవులలో కొనసాగుతున్న ఎంపిటీసిలు నాగిరెడ్డి సూర్య రామకృష్ణ, ఆకుల సుధాకర్ లను శాలువా లు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమ అయిదేళ్ళ పదవీ కాలంలో గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపించమన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు,రోడ్లు,డ్రైన్లు, పార్కులు, భవనాలు, స్మసానవా టికలు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో కృషి చేశామన్నారు. పాలకవర్గం, గ్రామ స్తులు, అధికారుల సహకారం మరువలేనిదన్నారు. ఆ పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఎంపిడివో (జిఎస్డభ్ల్యూఎస్) శ్యాం ప్రసాద్ కు స్వాగతం పలికి గ్రామాన్ని మరింత అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు. అందుకు తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ, సచివాలయ ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు

# వృద్ధుడిపై దాడి చేసి బంగారం దోచుకున్న నలుగురు అరెస్ట్

* సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించిన బొమ్మూరు పోలీసులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 5 :**హుకుంపేటకు చెందిన బంటు బాబూరావు అనే అతన్ని కొట్టి గాయపరిచి బంగారు వస్తువులు లాక్కుని పారిపోయిన నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి, చోరీ సొత్తు స్వాదీనం చేశామని బొమ్మూరు పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపారు. ఈ కేసు వివరాలు మీడియా కు వెల్లడించారు. గత నెల 18 తేదీన బంటు బాబూరావు తన యాక్టివా స్కూటర్ పై సాయంత్రం సెంటర్ నుండి ఇంటికి వెళ్ళుచుండగా గుర్తు తెలియని మగవ్యక్తి, మహిళ కలిసివచ్చి బండి ఆపారు. మీరు ఇల్లు అమ్ముటకు బేరం పెట్టారు కదా అని, ఇల్లు కొనుక్కును వ్యక్తి ఆవ రోడ్లో ఉన్నారని, అతనితో బేరం మాట్లాడడానికి రావాలని నమ్మించి, ఆవరోడ్లో ని కొబ్బరి తోట లోకి తీసుకుని వెళ్లరన్నారు. అక్కడ అతన్ని ముఖంపై కొట్టి మెడలో గల సుమారు మూడు కాసుల బంగారపు లాకెట్ చైను, రెండు కాసుల ఉంగరాలు రెండు లాక్కుని వెళ్లిపోయారన్నారు. దాంతో

బంటు బాబూరావు భార్య కృష్ణ వేణి 19 న పిర్యాదు ఇచ్చిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా సౌత్ జోన్ డిఎస్పీ యస్. భవ్య కిశోర్ పర్యవేక్షణలో, క్రైమ్ డిఎస్పీ సుభాష్ సూచనల మేరకు ఇన్స్పెక్టర్ , సిబ్బంది తో కలిసి, పై కేసు లో దోపిడీ కి పాల్పడిన నేరస్తుల పై సాంకేతిక పరిజ్ఞానమును వుపయోగించి నేరస్తులను గుర్తించి, వారి కదలికల పై నిఘా వుంచినట్లు ఆయన తెలిపారు. ఈనెల 3 తేది బొమ్మూరు కరెంట్ ఆఫీస్ వద్ద ముద్దాయిలను అరెస్ట్ చేసామన్నారు. ఈ కేసులో బాబూరావు నుంచి లాక్కుని పోయిన బంగారు వస్తువులను స్వాదీనం చేసుకున్నా. మన్నారు. గణపవరము మండలం, పిప్పర గ్రామనికి చెందిన గరగ శివ (29) ఇతనిపై పలు ప్రాంతాల్లో 8 పాత కేసులు ఉన్నాయన్నారు. ఇతనితో సహజీవనము చేస్తున్న నిడదవోలు మండలం, కోరుమామిడి గ్రామనికి చెందిన జాలపర్తి మేరి ( 30), పిప్పర గ్రామమునకు చెందిన జవ్వాది శ్రీను ( 26) , మావెల్ల సాయి (23) లను అరెస్టు చేశామని తెలిపారు. వీరి నుంచి పై చోరీ సొత్తు తో పాటు, నేరములు చేయుటకు ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్ళు, 4 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిల అరెస్ట్ తరువాత ఇచ్చిన ఒప్పుకోలు ప్రకారము బొమ్మూరు, కొత్తపేట, రామచంద్రాపురం, పామర్రు, అయినవిల్లి, అనపర్తి, రాజమండ్రి 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరధిలో మరో 7 కేసులలో దోపిడీలకు పాల్పడినట్లు, దొంగిలిశీచిన బంగారు వస్తువులను తాడేపల్లిగూడెంకు చెందిన గురజాడ ఆనంద్ కుమార్ కి అమ్ముచున్నట్లు ముద్దాయిలు తెలియజేసారన్నారు. ముద్దాయిలను అరెస్ట్ చేసిన ముద్దాయిలను అరవ కోర్ట్ లో హాజరుపరిచి రిమాండ్ కు పంపించామన్నారు.

## సంస్కరణల యోధుడు బాబు జగజ్జీవన్ రావ్ కు నివాళులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 5 :**
రూరల్ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తూర్పు గోదావరి జిల్లా వై.సి.పి అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అధ్యక్షతన బాబు జగజ్జివన్ రావ్ కి ఘనంగా నివాళులు అర్పించారు.


సంస్కరణల యోధుడు బాబు జగజ్జీవన్ రావ్119 వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా వై.సి.పి పార్టీ జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ నిర్వహించారు.ఈ సందర్భంగా చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ జీవితాంతం దళిత,బహుజనుల హక్కుల కోసం సమ సమాజ నిర్మాణం కోసం పాటుపడిన సమతామూర్తి జగజ్జీవన్ రావ్ అన్నారు. దేశం గర్వించదగిన గొప్ప పాలనాదక్షులు, దేశ తోలి ఉప ప్రధాని, బడుగు బలహీన వర్గల ఆశాజ్యోతి,సంఘ సంస్కర్త,స్వతంత్ర సమరయోధులన్నారు. 30 సం.లు కేంద్ర మంత్రిగా, 50 సం.లు సుదీర్ఘ కాలం రాజకీయాల్లో కొనసాగుతూ దేశ ప్రజలకు సేవలందించిన మహోన్నత వ్యక్తి అన్నారు
ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు లీగల్ సెల్ అధ్యక్షులు చింతపర్తి రాంబాబు,రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి అంగాడ సత్య ప్రియ,చాప రాజా,ఓడూరి రాంకీ,పెనుమాక సునీల్, కొడమంచిలి కోటిబాబు, ఉంద్రజవరపు సూర్య,అరుగుల రమణ,ఎండీ హమీద్ బాషా,షేక్ ఇబ్రహీం బాషాతదితరులు పాల్గొన్నారు.

# సమ సమాజ నిర్మాణానికి కృషి చేసిన బాబు జగజ్జీవన్ రామ్

**జిల్లా కలెక్టర్ , ప్రజా ప్రతినిధులు నివాళులు**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 5**: నగరంలోని జాంపేట చర్చి గేట్ వద్ద డా॥ బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ప్రజా ప్రతినిధులు, అధికారులు, బహుజనులు నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని డా॥ బాబు జగజ్జీవన్ రామ్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం గౌరవమని తెలిపారు. సమాజంలో అసమానతలను ఎదుర్కొంటూ ఎదిగిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషిని ఆదర్శంగా తీసుకుని సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వాడవాడలా జయంతి వేడుకలను నిర్వహించడం ఆనందకరమన్నారు. బాబు జగజ్జీవన్ రామ్ తీసుకున్న నిర్ణయాలు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదపడ్డాయని, ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అన్నారు.ఎంఎల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుల్లో బాబు జగజ్జీవన్ రామ్ ఒకరన్నారు. దేశానికి సంక్షోభ సమయాల్లో ఆయన ఇచ్చిన మార్గదర్శకత ఉపయోగప డిందన్నారు. జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాల సాధికారత కోసం బాబు జగజ్జీవన్ రామ్ చేసిన కృషి అమూల్యమని, ఆయన చూపిన మార్గంలోనే సమా సమాజం నిర్మాణం సాధ్యమని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరినప్పుడే బాబు జగజ్జీవన్ రామ్ ఆశయాలకు నిజమైన నివాళి అవుతుందని, కలిసి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎమ్ . సందీప్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, బహుజన సంఘాల నాయకులు, విద్యార్థులు స్థానిక ప్రజలు , మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రేమ, కరుణకు నిదర్శనం ఏసుక్రీస్తు పునరుత్థానం : మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 5**

క్రీస్తు పునరుత్థాన పర్వదినమైన ఈస్టర్ సందర్భంగా రూరల్ నియోజకవర్గం ధవళేశ్వరంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పర్యటించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ కాలనీ ఐస్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న సమాధుల తోటలో క్రైస్తవ సోదరులకు ఆదివారం మంత్రి దుర్గేష్ బ్రెడ్ , మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆరాధన పండుగ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు."
లోకరక్షకుడైన ఏసుక్రీస్తు తనను హింసించిన వారిని సైతం క్షమించాలని కోరుకున్న కరుణామయుడని, దుష్టులకు సైతం మారుమనస్సు కలగాలని ఆకాంక్షించిన ఆయన మార్గం మానవాళికి ఆదర్శం" అని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. సత్యం, కరుణ, ఐక్యత వంటి విలువలను ఆచరించేలా ఈస్టర్ పండుగ స్ఫూర్తినిస్తుందని తెలిపారు. స్థానిక బరియల్ గ్రౌండ్ కమిటీ , దైవజనులు విన్నవించిన సమస్యలపై మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. ధవళేశ్వరంలోని సమాధుల తోట వద్ద రోడ్డు , విద్యుత్ దీపాలను, ఫ్రీజర్ ఏర్పాటు చేయాలని, మృతదేహాల తరలింపు వ్యాన్ కావాలని వారు విన్నవించారు. మంత్రి దుర్గేష్ స్పందిస్తూ వచ్చే ఈస్టర్ నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసే దిశగా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పేదలకు సాయం చేస్తున్న విజ్ఞన శివను మంత్రి దుర్గేష్ అభినందించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ చర్చి ప్రతినిధులతో కలిసి క్యాండిల్ వెలిగించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ పవిత్ర దినం అందరి జీవితాల్లో శాంతి, ఆరోగ్యం, ఆనందాలను తీసుకురా వాలని ఆకాంక్షించారు. మంత్రి కందుల దుర్గేష్ కు స్థానిక క్రైస్తవ నాయకులు, దైవజనులు ఘనస్వాగతం పలికారు. అభివృద్ధి ప్రదాతగా మంత్రి దుర్గేష్ కు దేవుని ఆశీస్సులు ఉండాలని,. దైవజనులు ప్రార్థనలు చేసి, ఆయనను సత్కరించారు.

## యాంటీ ర్యాగింగ్ మరియు యాంటీ డ్రగ్ పై అవగాహన






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 05**:తాడేపల్లి గూడెంలోని శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & ఇంజినీరింగ్‌లో యాంటీ ర్యాగింగ్ మరియు యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని యాంటీ ర్యాగింగ్ కమిటీ, యాంటీ డ్రగ్ కమిటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు ఈగల్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించాయి. విద్యార్థుల్లో ర్యాగింగ్ మరియు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే హానికారక ప్రభావాలపై అవగాహన కల్పించడం,అలాగే ఆరోగ్యకరమైన మరియు భద్రమైన క్యాంపస్ వాతావరణాన్ని నెలకొల్పడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం సబ్-డివిజన్ డీఎస్పీ డి. విశ్వనాథ్ ర్యాగింగ్ మరియు మాదకద్రవ్యాలపై చట్టపరమైన చర్యలు, నివారణ మార్గాలు గురించి వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ సికిందర్ బాషా చట్టపరమైన అంశాలు మరియు వాటి ప్రభావాలపై కీలక ప్రసంగం చేశారు.
రీజినల్ మెడికల్ ఆఫీసర్ డా. పి. నవీన్ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్ కార్యక్రమానికి పరిచయ ప్రసంగం చేసి, విద్యార్థుల సంక్షేమానికి సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా.టి.జె.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు స్వాగత ప్రసంగం చేస్తూ విద్యార్థుల్లో క్రమశిక్షణ మరియు పరస్పర గౌరవం అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు బి. కిరణ్ కుమార్, షేక్ సల్మాన్ భాష, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబూ జగజీవన్ రామ్ కు నివాళులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 5:**మాజీ ప్రధాని, బాబు జగజీవనరామ్ 119వ జయంతి సందర్భంగా ఆదివారం రాజమండ్రి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక చర్చి గేట్ వద్ద బాబూ జగజీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా రాజమండ్రి పార్లమెంట్ కో ఆర్డినేటర్ టికె విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ, ప్రముఖ స్వాతంత్ర సమర యోధులలో జగజీవన్ రామ్ ఒకరని, వీరు కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా కార్మికులకు ఎంతో మేలు చేసారని, కార్మికులు వారిని నిరంతరం గుర్తు చేసుకోవాలన్నారు, అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ భారత్ దేశానికీ ఉప ప్రధానిగా, శ్రీమతి ఇందిరా గాంధీ హయాంలో దేశ కార్మిక , ఉపాధి కల్పన శాఖ మంత్రిగా పనిచేసిన బాబూ జగంజీవన్ రామ్, కుల వివక్ష పై అలుపెరుగనిపోరాటం చేసిన మహనీయులన్నారు. బాబూ జగజీవన్ కార్మిక లోకానికి నిత్య స్మరనీయలని, ఆయనను యువత ఆదర్శం గా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ప్రధాన కార్య దర్శి సిందియా రాణి, డాక్టర్ సెల్ అధ్యక్షులు డా .రాజశేఖర్, బీసీ సెల్ అధ్యక్షులు తాడి సూరి బాబూ, చంద్రకళ, తదితరులు బాపూజీకి నివాళులు అర్పించారు.

## స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక న్యాయ పోరాట యోధుడిగా, అణగారిన వర్గాల ఆశాదీపం బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 05.**భారతదేశ మాజీ ఉప ప్రధానిగా, జాతీయ నాయకుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక న్యాయ పోరాట యోధుడిగా, అణగారిన వర్గాల ఆశాదీపంగా పేరుపొందిన బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఈ రోజు డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఘనంగా నిర్వహించబడ్డాయి.
ఈ సందర్భంగా బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి డా.
కె. ధనంజయరావు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఉపకులపతి మాట్లాడుతూ, "బాబు జగజ్జీవన్ రామ్ గారు అణగారిన వర్గాల అభ్యున్నతికి, దేశ రక్షణకు మరియు వ్యవసాయ రంగ అభివృద్ధికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. ముఖ్యంగా 'హరిత విప్లవం' ద్వారా దేశాన్ని ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టి.బి.ఆర్ సైనిక్ స్కూల్, -- 20వ వార్షికోత్సవ వేడుకలు "పరంపర 2026" ఘనంగా నిర్వహణ






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 05:**ప్రత్తిపాడు లోని టి.బి.ఆర్ ఎన్.డి.ఏ గ్రౌండ్‌లో టి.బి.ఆర్ సైనిక్ స్కూల్, అలంపురం ఆధ్వర్యంలో నిర్వహించిన 20వ వార్షికోత్సవ వేడుకలు "పరంపర 2026" అత్యంత వైభవంగా, అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి టి.బి.ఆర్ గ్రూప్ చైర్మన్ టి. భోగేశ్వర రావు అధ్యక్షత వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ ఓ ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జీ , రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ శ్రీ కె.జి. కృష్ణ, ఎన్.సి.సి ఎలూరు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి భోగిరెడ్డి ఆదిలక్ష్మి పాయకరావుపేట జనసేన సీనియర్ నాయకులు శ్రీ తోట నాగేష్ , బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి పైడికొండల సింధు, జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా తదితరులు హాజరయ్యారు. వారితో పాటు ఎయిర్ వెటరన్స్, మాజీ సైనికులు, ఎన్.డీ.ఏ ప్రతినిధులు, కూటమి నాయకులు, పోలీస్ మరియు విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా గాంధీ పీస్ ఫౌండేషన్, నేపాల్ తరఫున వచ్చిన ప్రతినిధులు డాక్టర్ అమిత్ కుమార్ దూబే మరియు ఎన్.ఎస్. మంకర్ చేతుల మీదుగా టి.బి.ఆర్ గ్రూప్ చైర్మన్ టి. భోగేశ్వర రావు కి ఆయన చేస్తున్న సైనిక సేవకు, సమాజ సేవకు గాను గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది. ఇది సంస్థకు గర్వకారణంగా నిలిచింది.

అలాగే శ్రీ టి. భోగేశ్వర రావు రచించిన "వింగ్స్ బియాండ్ ది స్కై -- ట్రాన్స్ఫర్మేషనల్ జర్నీస్ అఫ్ ఎయిర్ వారియర్స్" అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ పుస్తకం భారత వాయుసేనలో సేవలందించిన వీరుల జీవితాల్లో జరిగిన మార్పులను, వారి స్ఫూర్తిదాయక ప్రయాణాలను ప్రతిబింబిస్తుంది.

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. "ఆపరేషన్ సిందూర్" ప్రదర్శన దేశభక్తి, సైనికుల త్యాగాలను హృదయానికి హత్తుకునేలా ప్రతిబింబించింది. "చావా" ప్రదర్శన ఛత్రపతి సంభాజీ మహారాజ్ మరియు యోధుల ధైర్యం, వీరత్వాన్ని చూపిస్తూ ప్రేక్షకుల్లో ఉత్తేజాన్ని నింపింది. "నరసింహ" నృత్య రూపకం ఆధ్యాత్మికత, శక్తి, ధర్మ విజయం వంటి విలువలను అద్భుతంగా ప్రదర్శించింది. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సంగీత కార్యక్రమాలు సాంప్రదాయం మరియు ఆధునికత కలయికగా నిలిచాయి. ప్రతి ప్రదర్శనలో క్రమశిక్షణ, ప్రతిభ, సాధన స్పష్టంగా కనిపించాయి.

ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా మరియు సాంస్కృతిక ప్రతిభకు గాను బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, క్రీడలు మరియు ఇతర విభాగాల్లో మెరుగైన ప్రదర్శన చేసినవారిని సన్మానించారు. అదేవిధంగా ఉత్తమ ఉపాధ్యాయులు మరియు సిబ్బందిని కూడా గౌరవించి వారి సేవలను అభినందించారు.

ఈ సందర్భంగా ప్రసంగించిన అతిథులు టి.బి.ఆర్ సైనిక్ స్కూల్ విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, దేశభక్తి విలువలను ప్రశంసించారు. భవిష్యత్తులో ఇలాంటి సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. చైర్మన్ టి. భోగేశ్వర రావు మాట్లాడుతూ, "20 సంవత్సరాల ప్రయాణం అనేది కేవలం ఒక మైలురాయి మాత్రమే కాదు, విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, దేశసేవ భావన పెంపొందించడం మా లక్ష్యం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సంస్థ ప్రతిష్టను మరింత పెంచుతూ, విద్యార్థులకు ప్రేరణనిచ్చేలా విజయవంతంగా ముగిసింది.

## పట్టణంలో బాబు జగన్ జీవన్ 119 జయంతి వేడుకలు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 05:**ఈ రోజు పట్టణంలో బాబు జగన్ జీవన్ 119 జయంతి సందర్భంగా యాగర్లపల్లి యూత్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాన్ని కి పూల మాల అర్పించిన జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ, ఎ యమ్ సి చైర్మన్ చాపలా రమేష్, శీలి వెంకటాచలం , బాబు జగన్ జీవన్ , చిన్న వెంకట్రామయ్య , చెప్పుల వాసు , వడ్డీ నవీన్, యజ్జల సందీప్ , బాబ్జీ, కేశవభట్ల విజయ్ , మద్దాల మణి కుమార్ గారు, ఆడబాల మురళి , గట్టిం నాని , మట్టా రామకృష్ణ , పవన్ , కిశోర్, స్కందక రమణ , మలపాక చిట్టి, రౌతు సోమరాజు , అత్తిలి బాబి, వాక నాని

## జగ్గన్నపేట గ్రామంలో శ్రీ విజయగణపతి స్వామి వారి నూతన ఆలయ ప్రారంభోత్సవంలో రఘురామ్





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 05:**తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ విజయగణపతి స్వామి వారి నూతన ఆలయాన్ని తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పచ్చ రామచంద్ర రావు. పచ్చ సీతారామయ్య. పచ్చ పవన్. మోపిదేవి శ్రీనివాస్. బొల్లం సూర్యనారాయణ. వెంకటేశ్వరరావు. డి రాజశేఖర్. కె స్టీఫెన్. కార్తీక్. , గొర్రెల శ్రీనివాస్, గుండుమోగులు బలుసులు , చిట్టూరి బాపన్న. కలిశెట్టి తాతారావు. బూడి ప్రసాద్. మాకరాజు సతీష్ . అఖిల్ గోబ్బిల్లా అజయ్.పచ్చా సీత రామయ్య, , కేసని అశోక్ , , కిరణ్ రెడ్డి, ,వట్టి సోమేశ్వరరావు. కృష్ణ రాజు గారు. దారపు రెడ్డి శ్రీనివాస్. చంద్రు శీను. రాజమహేంద్రవరపు లక్ష్మణరావు. పూరెళ్ళ అన్నవరం గ్రామ నాయకులు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

## టీడీపీ అధ్వర్యం లో బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 05:**ఈ రోజు తాడేపల్లిగూడెం బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తాడేపల్లిగూడెం పెంటపాడు మండలం ఉమామహేశ్వరం,కే పెంటపాడు, రాచర్ల, ప్రత్తిపాడు, మరియు రూరల్ మండలం పట్టింపాలెం గ్రామాలలో బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన తాడేపల్లిగూడెం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి)

ఈ కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, గంధం సతీష్, సూర్పన వెంకట్రావు, శ్రీరాముల విజయలక్ష్మి, దాట్ల జగన్నాథరాజు, ఆలపాటి నాగేశ్వరరావు, ముప్పిడి రమేష్, చెప్పుల వాసు, మద్దుకూరి రామకృష్ణ, వల్లేపల్లి గోపాలకృష్ణ, పంతం శేఖర్, కొండ్రెడ్డి సురేష్, బుర్ల రాము, జాస్తి శేషారావు , కారంకి గంగయ్య, తాడేపల్లి శ్రీను, సుబ్బరాజు, శీలి వెంకటాచలం, చీకట్ల సంసోను ,దలై తిరుమలరావు, అడ్డు రంజిత్, శ్రీరాముల నాగేశ్వరరావు, బాదంపూడి రామకృష్ణ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 5:**రామకృష్ణ మిషన్ రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులో ఆదివారం ఉచిత సంచార వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ తెలిపారు.ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో సుమారు 150 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. శిబిరంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ శ్రీనివాస్ రాయుడు, డాక్టర్ రాజేష్ ఖన్నా పాల్గొని రోగులను పరీక్షించి చికిత్స అందించారు.అదేవిధంగా, 57 మందికి రక్తపరీక్షలు, 8 మందికి థైరాయిడ్ పరీక్షలు, 5 మందికి ఈసీజీలు నిర్వహించగా, 8 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించారు. శిబిరానికి హాజరైన రోగులు మరియు సహాయకులకు అన్నదానం కూడా నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, వైద్య సేవల సమన్వయకర్త కానుమొను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ముని్సపాలిటీ కార్యాలయంలో నేడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఏప్రిల్ 05,** తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో నేడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం. యేసుబాబు డా. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, దేశ మాజీ ఉప ప్రధానిగా బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ తన జీవితాన్ని సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అంకితం చేశారని కమిషనర్ గుర్తు చేశారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు నిబద్ధతతో, నిజాయితీగా సేవలు అందించాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సెక్షన్ హెడ్లు, సిబ్బంది అందరూ పాల్గొని మహనీయునికి నివాళులు అర్పించారు.

సమానత్వం, సేవా భావంతో పురపాలక పాలన కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేయడంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ ఎం యేసు బాబు తో పాటు మేనేజర్ రవి సుధాకర్ , టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి జగదీశ్వర రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ హరీష్,సానిటేషన్ సూపర్వైజర్ సోమేశ్వరరావు , ఏ1 గుమస్తా సురేష్, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాస్ మరియు ఇతర పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదేవరపేటలో ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు




**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 5:**భారతదేశంలో ఒక గొప్ప నాయకుడైన బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా అన్నదేవరపేటలోని అరుంధతీ పేటలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న కాకర్ల సత్యేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ 1908 ఏప్రిల్ 5న బిహార్ రాష్ట్రంలో జన్మించారని, చిన్నప్పటి నుంచే ఆయన కుల వివక్షను ఎదుర్కొన్నప్పటికి, తన ధైర్యంతో, పట్టుదలతో ముందుకు సాగారని అన్నారు. ఆయన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లో చేరి స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ప్రజల సేవలో నిరంతరం పనిచేశారని చెప్పారు. జగ్జీవన్ రామ్ రక్షణ మంత్రి, వ్యవసాయ మంత్రి వంటి అనేక కీలక పదవులు నిర్వహించారని, ముఖ్యంగా 1971 ఇండో–పాక్ యుద్ధం సమయంలో ఆయన చేసిన సేవలు దేశానికి ఎంతో గొప్పవని సూచించారు. మరి ముఖ్యంగా భారత ఉపప్రధానిగా ఆయన దేశానికి సేవలు అందించారని తెలిపారు. ఆయన దళితుల అభ్యున్నతి కోసం, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడారని, ఆయన ప్రజల మధ్య బాబు జగ్జీవన్ రామ్ గా ప్రసిద్ధి పొందారని పేర్కొన్నారు. మనమందరం ఆయన జీవితం నుండి ఒక గొప్ప పాఠం నేర్చుకోవాలని, ఏ కష్టాలు వచ్చినా పట్టుదలతో ముందుకు సాగితే విజయాన్ని సాధించవచ్చు అనేది ఆయన జీవితం నుండి మనందరం నేర్చుకోవలిసిన అంశం అని అన్నారు. ఈ జయంతి వేడుకల్లో కూచిపూడి లక్ష్మణ్ రావు, కూచిపూడి గణేష్, వీరమళ్ళ బంగారం, కాట్రాజుల బంగార్రాజు, బొట్టా ప్రసాద్, ఉప్పె శివ పాల్గొన్నారు. అదేవిధంగా అరుంధతీ పేట నుండి కొడమంచిలి బంగారయ్య, బొచ్చు శ్రీను, గెడ్డం పండు, బొచ్చు విజయ కుమార్, చిడిపి రమేష్, కౌలురి ప్రసాద్ అనేక మంది అరుంధతిపేట సోదరులు పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చెయ్యటం జరిగింది.

# లారీ ఢీ ఇద్దరి మృతి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఏప్రిల్ 5 ;** ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఇద్దరు గిరిజన యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తాటి రామన్నగూడెం గ్రామానికి చెందిన మడకం సంతోష్(19 )పండు సందీప్(20 )ఆదివారం ద్విచక్ర వాహనంపై తెలంగాణ రాష్ట్రం అస్వరావుపేట మండలం చిచ్చోడి గుంట గ్రామంలో ఒక ఫంక్షన్ కి హాజరై తిరిగి వస్తుండగా బచ్చు వారి గూడెం గ్రామం దాటిన తర్వాత గాండ్ల గూడెం శివారులో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## పోరాటయోధుడు జగజ్జీవన్ రామ్ -సువర్ణ రాజు



**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 5.** పోరాట యోధుడు మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ అని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు కొనియాడారు. జగజ్జీవన్ రామ్119వ జయంతి వేడుకలు దేవరపల్లి గ్రామంలో జగజ్జీవన్ రామ్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన సువర్ణ రాజు మాట్లాడుతూ ఆయన సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, రాజకీయ వేత్తగా దేశానికి ఎంతో సేవ చేయడం అభినందనీయం అని పేర్కొన్నారు. అటువంటి మహోన్నతమైన వ్యక్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా జగత్ జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడిమిరాజు, కూటమి నాయకులు సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, కంబాల సత్తిబాబు, కాట్రు భీమరాజు, యూత్ సభ్యులు చిలిపి చందు, రాపాక విజయ శేఖర్, ప్రత్తిపాటి కోట వీర వెంకట సత్యనారాయణ, మల్లిపూడి ప్రతాప్, చిత్ర రాజేంద్ర, కొడమంచిలి సతీష్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తిమ్మాపురం లో కులం సర్టిఫికెట్ రద్దు చేయడంపై గిరిజన సంఘాల ఆగ్రహం...

- పీసా గ్రామ సంఘం చేసిన తీర్మానాన్ని కూడా తోసి పుచ్చిన అధికారులు అని గిరిజన సంఘాల ఆరోపణ ..



**అడ్డతీగల, పెన్ పవర్, ఏప్రియల్ 05**: అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామంలోని ముత్యాల. హాసిని (కొండ రెడ్డి) కులమునకు చెందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని ఇటీవల అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ రద్దు చేయడాన్ని, కొండ రెడ్లు కులానికి చెందిన జిల్లా నాయకులు మండల నాయకులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే తిమ్మాపురం గ్రామానికి చెందిన ముత్యాల .రామిరెడ్డి పూర్వీకుల నుండి కొండ రెడ్డి కులస్తులుగా గుర్తింపు పొందాడు. అయితే ఇదే ఇంటిపేరు గల కులస్తులు అడ్డతీగల మండలంలో కూడా అనేక మంది కుటుంబాలు కొండ రెడ్లుగానే ప్రస్తుతం చాలామంది ఉన్నారు ,అని వనవాసి సంఘం అధ్యక్షులు బొగ్గుల. కాటంరెడ్డి తెలియజేశారు.

అయితే ఇటీవల ఈ కుటుంబానికి (ఎల్ టి ఆర్ పి) కోర్టు లో సుమారు 13 ఎకరాలు భూమి ముత్యాల. రామి రెడ్డి పరం అవడంతో ఈ 13 ఎకరాల భూమిపై రిటైర్ అయిన గిరిజనేత్రుడికి చెందిన ఒక అధికారి కళ్ళు పడడంతో, ఆ భూమిని ఏ విధంగానైనా తిరిగి వాళ్ల దగ్గర నుండి లాక్కోవాలని ఆ వ్యక్తి ఒక గిరిజనుని ద్వారా ఆ భూమిపై (ఎల్ టి ఆర్ పి ) కేసు పెట్టించి, ఆ భూమిని లాక్కునే ప్రయత్నంలో భాగంగా ముందుగా దేవిపట్నం నకు చెందిన ఒక ముంపు బాధితుడికి ముత్యాలు ఇంటిపేరు గల ఆ వ్యక్తి అక్కడ గిరిజనేత్రుడుగా ఉన్న ధ్రువీకరణ పత్రం ద్వారా తిమ్మాపురం నకు చెందిన ముత్యాల. రామి రెడ్డి కూడా గిరిజనేత్రుడే అని అతని కుల సర్టిఫికేట్ వెంటనే రద్దు చేయాలని, ఈ భూమిపై కళ్లుబడిన వ్యక్తి అధికారులను అడ్డుపెట్టుకొని సంవత్సరం కూడా కాకుండానే ముత్యాల. రామిరెడ్డి సర్టిఫికెట్లను రద్దు చేయడం వెనుక అధికారులు కూడా, అతనితో మిలాకితమై పీసా గ్రామ సంఘం తీర్మానాలను కూడా ప్రక్కన పెట్టి ,ఈ కుటుంబం చెందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయడం చాలా అన్యాయమని కొండరెడ్ల గిరిజన సంఘం నాయకులు అధికారుల తీరుపై మండిపడ్డారు. వీళ్ళకి జరిగిన అన్యాయం పై కోర్టు ద్వారా అధికారుల మీద కేసులు నమోదు చేయించి ,వీళ్ళకి తిరిగి కొండారెడ్డి సర్టిఫికేట్ ఇచ్చేవరకు పోరాడుతామని గిరిజన సంఘం నాయకులు వెదుళ్ళ. లచ్చిరెడ్డి, బొగ్గుల. కాటంరెడ్డి ,సమర్థ .కృష్ణ, పల్లాల మంగిరెడ్డి అధికారులను హెచ్చరించారు. ఏళ్ల తరబడి డి ఎల్ ఎస్ లో అనేక కుల సర్టిఫికెట్లు పెండింగ్ ఉన్నప్పటికీ, ఈ ఒక్క కుల సర్టిఫికెట్ రద్దు చేయడం వెనుక అధికారుల అత్యుత్సాహం తేటతెల్లం అవుతుందని గిరిజన సంఘం నాయకులు ఆరోపించారు. ఈ గిరిజనేత్రుడు ఈ కుటుంబానికి పెట్టిన మానసిక వేదనకు గురై ముత్యాల. రామిరెడ్డి అకాల మరణం చెందాడని, రామిరెడ్డి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు . మృతి చెందిన ముత్యాల రామిరెడ్డి కి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు అనాథలు అయ్యారని గ్రామస్తులు, కుల సంఘాలు విలవిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తిరిగి పీసా గ్రామ సంఘాశీ ఇచ్చిన తీర్మానాన్ని అమలుపరిచి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని, గ్రామస్తులు, కుల పెద్దలు అధికారులకు విన్నవిస్తున్నారు.

## అడ్డతీగల లో బాబు జగజీవన్ రావు జయంతి వేడుకలు....



**అడ్డతీగల, పెన్ పవర్, ఏప్రియల్ 05**: అడ్డతీగల స్థానిక గాంధీ సెంటర్లో రాష్ట్ర ఏపీసీసీ కాంగ్రెస్ కార్యదర్శి దంగేటి .సత్తిబాబు ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగజీవన్ రావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. దంగేటి. సత్తిబాబు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు సంఘ సంస్కర్త భారతనికి విశేష సేవను అందించిన, మాజీ ఉప ప్రధాని దళితుల ఆశాజ్యోతి బాబు జగజ్జీవన్ రావు అని అన్నారు. దేశానికి, దళితులకు ఎనలేని సేవలు అందించిన మహా నాయకుడు బాబు జగజ్జీవన్ రావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పంచాయితీ మాజీ సభ్యులు దొమ్మేటి .అప్పారావు, రామకృష్ణ , ఎస్. రమణ, దళిత సంఘ సభ్యులు పాల్గొని డాక్టర్ బాబు జగజీవన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించరు .

## వైభవంగా శ్రీ నారాయణగిరిపై శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు






**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 5:**పోలవరం జిల్లా రంపచోడవరం మండలం రంపచోడవరం లోని శ్రీ నారాయణగిరిపై వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర కల్యాణ కార్యక్రమాన్ని ద్వారకాతిరుమల దేవస్థానం వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించగా, దేవస్థాన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వర రావు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగజ్జీవన్ రామ్.



మాజీ మంత్రి వనిత.

**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 5.** స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ అని మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తానేటి వనిత కొనియాడారు. జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గోపాలపురం, నల్లజర్ల తదితర మండలాల్లో జరిగిన ఈ వేడుకలకు వనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగజ్జీవన్ రామ్ దేశ స్వాతంత్ర సాధనలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. కేంద్ర మంత్రిగా పేదల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు చేసిన గొప్ప యోధులుగా అభివర్ణించారు. ఆనాటి రోజుల్లోదళిత జాతిలో జన్మించి అన్ని రంగాల్లో రాణించిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో భాగంగా గోపాలపురం ఉప్పర గూడెంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గెల్లా శ్రీను ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకలో కేక్ కట్ చేసి కార్యక్రమానికి హాజరైన వారికి తన స్వహస్తాలతో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామ్మోహన్ రెడ్డి, సాలి వేణు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, ఎస్.కె వల్లి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముందు వనిత తాళ్లపూడి మండలం తుపాకుల గూడెం గ్రామంలో ఉన్న తన మాతృమూర్తి సుశీలమ్మ సమాధి వద్దకు వెళ్లారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని తల్లి సమాధి వద్ద నివాళులర్పించారు. ఆమె వెంట సోదరి సునీత ఆశీర్వాదం దంపతులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు



**గంగవరం పెన్ పవర్ ఏప్రిల్ 5:**పోలవరం జిల్లా ఏజెన్సీ గంగవరం మండలంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. మంగళగిరిలో పార్టీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రిని కలిసి మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. ప్రధానంగా సాగునీరు త్రాగునీరు రహదారులు అభివృద్ధి చేయాలని కోరారు. భూపతిపాలెం రిజర్వాయర్ నుండి ప్రధాన కాలువ నిర్మించినప్పటికీ సాగునీరు అందడం లేదని మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించాలని కోరారు. అలాగే మండలంలోని పలు రహదారులు అభివృద్ధికి నోచుకోలేదని గత ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన రహదారులను అభివృద్ధి చేయాలని తదితర సమస్యలను వివరిస్తూ ముఖ్యమంత్రి కి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చినట్లు వెంకటరెడ్డి తెలిపారు.

## కొత్తగా వేస్తున్న రోడ్డుపై ఇసుక లారీలను తిరగనివ్వం.గ్రామస్తులు ఆగ్రహ వ్యక్తం.

**సీతానగరం, పెన్ పవర్, ఏప్రిల్ 5:**కొత్త రోడ్డు పై ఇసుక లారీలు రావొద్దని మండలంలోని సింగవరం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సింగవరం ఏటిగట్టు
గత రెండు నెలల నుండి రహదారి పూర్తిగా పనులు ప్రారంభించి తారు రోడ్డు వేశారు. వేసిన రోడ్డు మీద సింగవరం ఇసుక ర్యాంపు యాజమాన్యులు మనల్ని ఎవడ్రా ఆపేది అనే రీతిలో భారీ వాహనాలతో ఇసుక తరలించడంతో రోడ్డు దెబ్బతింటుంది అని గ్రామస్తులు వాహనదారులు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు నియమాలు పాటించకుండా అధిక లోడుతో లారీలు తిరిగితే రోడ్డుపై లారీలను నిలిపివేస్తామని అవసరమైతే రాస్తారోకో చేస్తామని అన్నారు. ఆర్ అండ్ బి అధికారులు ఈ రహదారిపై సుమారు 20 రోజుల వరకు ఇసుక లారీలకు అనుమతి లేకుండా చేయాలని గ్రామస్తులు తెలిపారు.

## వచ్చే పుష్కరాలలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలి





పుష్కరాల సందర్భంగా పోలీస్, ఇతర శాఖల అధికారులతో

రాష్ట్ర డి.జి.పి హరీష్ కుమార్ గుప్తా సమీక్ష

**రాజమహేంద్రవరం ,పెన్ పవర్,ఏప్రిల్ 5**
రానున్న గోదావరి పుష్కరాల్లో అన్ని ప్రభుత్వ శాఖలు కలిసి సమన్వయంతో పనిచేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర డి.జి.పి హరీష్ కుమార్ గుప్తా పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో రానున్న పుష్కరాల సందర్భంగా పోలీస్ ఇతర శాఖల అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డి.జి.పి హరీష్ కుమార్ గుప్తా నిర్వహించారు.

ఈ సందర్భంగా డీజీపీ కి జిల్లా ఎస్పీ తూర్పుగోదావరి జిల్లా భౌగోళిక స్వరూపం, స్థితిగతులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం అధికారులకు రానున్న పుష్కరాల సందర్భంగా డి.జి.పి పలు సూచనలు ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ , వై. మేఘ స్వరూప్ , మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా , డి.ఐ.జి కె. ఫకీరప్ప, కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ , ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.పుష్కర్ జాయింట్ యాక్షన్ టీమ్స్ ను ఏర్పాటు చేయాలన్నారు.

ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడానికి ఏ ఐ తో కూడిన అస్త్రం టీమును సంప్రదించి తగు విధి విధానాలు రూపొందించాలన్నారు. ప్రయాగ్ లో జరిగిన కుంభమేళాను అధ్యయనం చేయడానికి ఒక ప్రత్యేక టీమును పంపి, తదనుగుణంగా ప్రణాళిక రూపొందించాలన్నారు.అన్ని ఘాట్లు నందు సీసీ కెమెరాలు రోజంతా పర్యవేక్షించేందుకుగాను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు స్టేట్ బోర్డర్స్, డిస్ట్రిక్ట్ బోర్డర్స్ పోలీసులతో సరైన కమ్యూనికేషన్ ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

అన్ని ఘాట్ లకు స్నానాలకు వచ్చే భక్తులకు నిర్ణీత పరిధికి సంబంధించి తగినన్ని డ్రోన్ల ద్వారా పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం భక్తులకు ఎప్పటికప్పుడు రద్దీకి సంబంధించిన సూచనలు తెలియపరచాలన్నారు.

ఎమర్జెన్సీ రూట్ ప్లాన్ ను సిద్ధం చేసుకోవాలన్నారు.పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఓ ఎన్ జి సి హెలికాప్టర్ ను ఉపయోగించి జాయింట్ ఏరియల్ సర్వే నిర్వహించాలన్నారు.ఎన్ సీ సి, ఎన్ ఎస్ ఎస్, వాలంటీర్ల సేవలను వినియోగించు కోవాలన్నారు.ఘాట్ లకు వచ్చే భక్తుల రద్దీని క్రమబద్ధీ కరించడానికి (క్యూ లైన్) టీటీడీ దేవస్థాన అధికారులతో సంప్రదించి ప్రణాళికను రూపొందించాలన్నారు.

భక్తులు అన్ని ఘాట్లకు సమ ప్రాధాన్యత వచ్చే విధంగా సోషల్ మీడియా ద్వారా అవగాహన కలిగించాలన్నారు. ప్రస్తుతం నగర జనాభా వాహనాల పై గణాంకాలు తయారుచేసి, భవిష్యత్తులో పెరిగే జనాభా, వాహన లపై నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించాలన్నారు.

పుష్కరాలలో పనిచేసే అన్ని శాఖల సిబ్బందికి భోజన సదుపాయాలకు ఏర్పాటునకు ఏకీకృత సేవా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం బస్టాండ్ సమీపంలో, రానున్న పుష్కరాల సందర్భంగా నిర్మించిన పోలీస్ గెస్ట్ హౌస్ నూతన భవనం జాంపేట ఓల్డ్ ఏ ఆర్ఆఫీస్ నందు నూతన డాగ్ కెన్నెల్ ను డి.జి.పి హరీష్ కుమార్ గుప్తా ప్రారంభించారు. జిల్లాకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డి.జి.పి హరీష్ కుమార్ అడిషనల్ డిజి(లా అండ్ ఆర్డర్) ఎన్. మధుసూదన్ రెడ్డి, ఏలూరు రేంజ్ ఐ.జి జీ.వి.జి అశోక్ కుమార్ తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఇతర పోలీసు అధికారులు ఘన స్వాగతం పలికారు.

# ఆర్సీబీ ఆల్ రౌండ్ షో.. చెన్నైపై 43 పరుగుల తేడాతో గ్రాండ్ విక్టరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో భాగంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో జరిగిన పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 43 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్ (70), దేవదత్ పడిక్కల్ (50), రజత్ పాటిదార్(48), ఫిల్ సాల్ట్ ( 46), విరాట్ కోహ్లీ (28) అద్భుతమైన బ్యాటింగ్ చేయడంలో భారీ స్కోర్ చేసింది.

ఇక 251 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు కేవలం 19. 4 ఓవర్లలోనే ఆలౌట్ అయింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సీఎస్కే జట్టు టాపార్డర్ మరోసారి ఘోరంగా విఫలమైంది. సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (7) మొదటి ఓవర్లోనే జాకబ్ డఫీ పెవిలియన్ కి పంపించగా, అనంతరం క్రీజులోకి వచ్చిన ఆయూష్ మాత్రే(1)ని రెండో ఓవర్లో భువనేశ్వర్ కుమార్ ఔట్ చేశాడు. మూడో ఓవర్లో స్టార్ బ్యాటర్ సంజు శాంసన్ (9)ని డఫీ ఔట్ చేయడంతో డగౌట్ కి వెళ్లిపోయాడు. దీంతో 30 పరుగులకే కీలకమైన 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన లిసర్ఫరాజ్ ఖాన్ (50) మెరుపు హాఫ్ సెంచరీతో సీఎస్కే స్కోర్ బోర్డుని ముందుకు నడిపించేందుకు ప్రయత్నించాడు. కానీ కృనాల్ పాండ్యా బౌలింగ్ లో భారీ షాట్ ఆడబోయి స్టంప్ ఔట్ కాగా, ఆ తర్వాత ఓవర్లలోనే ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన కార్తిక్ శర్మ (6) ఏమాత్రం ప్రభావం చూపించకుండానే కృనాల్ బౌలింగ్ లోనే అభినందన్ సింగ్ కి క్యాచ్ ఇచ్చి మైదానం వీడాడు. దీంతో 84 పరుగులకే ఏకంగా 5 వికెట్లని నష్టపోయింది సీఎస్కే. ఇక తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే వచ్చి రావడంతోనే ఫస్ట్ బంతిని మైదానం స్టాండ్స్ లోకి కొట్టి మంచి ఊపు మీద కనిపించినప్పటికీ, కేవలం 18 పరుగులు చేసి అభినందన్ సింగ్ బౌలింగ్ లో జితేష్ శర్మకి క్యాచ్ ఇచ్చి క్రీజు వదిలి పెట్టి వెళ్లిపోయాడు దూబే. చివర్లో బ్యాటింగ్ కి వచ్చిన ప్రశాంంత్ వీర్, జేమీ ఓవర్టిన్ మధ్య 57 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

చివర్లో ప్రశాంత్ వీర్ దూకుడైన బ్యాటింగ్ తో ఆర్సీబీ బౌలర్లపై విరుచుకు పడ్డాడు. హాఫ్ సెంచరీ దిశగా కొనసాగుతున్న అతడ్ని భువనేశ్వర్ కుమార్ ఔట్ చేశాడు. ఇక జేమీ ఓవర్టిన్ సైతం 37 పరుగులు చేసిన తర్వాత సుయాష్ శర్మ బౌలింగ్ లో పెవిలియన్ కి వెళ్లిపోయాడు. ఆ తర్వాత బ్యాటింగ్ కి వచ్చిన నూర్ అహ్మద్ 8 పరుగులు చేసిన డగౌట్ కి వెళ్లిపోయాడు. లాస్ట్ ఓవర్లో అన్షల్ కాంబోజ్ బ్యాట్ ఝుళిపించినప్పటికీ 207 పరుగులకే ఆలౌట్ అయింది. ఇక రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 3వికెట్లు తీసుకోగా, జాకబ్ డఫీ, కృనాల్ పాండ్యా, అభినందన్ సింగ్ తలో రెండు వికెట్లు పడగొట్టగా, సుయాష్ శర్మ ఒకటి తీసుకున్నాడు.

# హైదరాబాద్ కోటలో లక్నో జయభేరి.. కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టిన పంత్





**హైదరాబాద్ పెన్ పవర్:** సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఉప్పల్ స్టేడియంలో జరిగిన హోరాహోరీ పోరులో లక్నో సూపర్ జెయింట్స్ విజయం సాధించింది. చివరి ఓవర్ వరకు అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో, కెప్టెన్ రిషబ్ పంత్ తనదైన శైలిలో బ్యాటింగ్‌తో జట్టును గెలిపించి, సొంత ప్రేక్షకుల మధ్య హైదరాబాద్‌ను ఓడించి లక్నోకు కీలకమైన విజయాన్ని అందించారు. 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్, ఒక దశలో ఒత్తిడిలో పడినా కెప్టెన్ రిషబ్ పంత్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశారు. మైదానం నలుమూలలా షాట్లతో విరుచుకుపడిన పంత్, ఒత్తిడిని అధిగమించి జట్టును విజయతీరాలకు చేర్చారు. మరోవైపు, మార్కరమ్ కూడా అద్భుతమైన పోరాట పటిమను కనబరిచారు.

**సొంత గడ్డపై హైదరాబాద్‌కు నిరాశ...**

సొంత ప్రేక్షకుల మద్దతు ఉన్నప్పటికీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ మ్యాచ్‌లో విజయాన్ని అందుకోలేకపోయింది. క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి తొలి ఇన్నింగ్స్‌లో జట్టును ఆదుకున్నా, లక్నో బ్యాటర్లను కట్టడి చేయడంలో హైదరాబాద్ బౌలర్లు విఫలమయ్యారు. ఈ విజయంతో లక్నో పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచు



# 19వ ఓవర్.. అదంతా ధ్రువ్ జురెల్ ప్లాన్: రియాన్ పరాగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో కాస్త ఉత్కంఠభరితంగా సాగిన పోరుల్లో రాజస్థాన్ రాయల్స్-గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ ముందుంటుంది. 211 పరుగు లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ 204/8 స్కోరు వద్దే ఆగిపోయింది. ఆఖరి రెండు ఓవర్లలో కేవలం 15 పరుగులు మాత్రమే చేయాల్సిన తరుణంలో గుజరాత్ తడబడటం గమనార్హం. ఇక ఆ రెండు ఓవర్లను వేసిన రాజస్థాన్ బౌలర్లపై ప్రశంసల వర్షం కురుస్తోంది. మరీ ముఖ్యంగా 19వ ఓవర్‌లో జోఫ్రా ఆర్చర్ కేవలం నాలుగు పరుగులే ఇచ్చాడు. అతడిని బౌలింగ్‌కు తీసుకురావడం వెనుక ధ్రువ్ జురెల్ ఉన్నాడని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ వెల్లడించాడు. అలాగే చివరి ఓవర్‌ను దేశ్‌పాండేకు ఇవ్వడం కూడా రాజస్థాన్ తీసుకున్న కఠిన నిర్ణయం. నాంద్రీ బర్గర్, సందీప్ శర్మకు అప్పటికి ఇంకా ఒక్కో ఓవర్ మిగిలే ఉన్నాయి. అయినా దేశ్‌పాండేకు బంతి ఇచ్చిన కెప్టెన్ ఫలితం అనుకూలంగా రాబట్టాడు. ఆర్ఆర్‌ను ఆరు పరుగుల తేడాతో దేశ్ పాండే గెలిపించాడు."ఈ మ్యాచ్‌లో నేను చాలా అవకాశాలను తీసుకున్నా. ఏదైతే అది జరుగుతుందనే ఉద్దేశంతో ముందడుగు వేశా. మా కుర్రాళ్లు అద్భుతం చేశారు. అరిచి అరిచి నా గొంతు కూడా బొంగురుపోయింది. మా బౌలర్లు ప్రణాళికలను పక్కాగా అమలు చేసి చూపించారు. ఓ దశలో విపరీతమైన టెన్షన్ వచ్చేసింది. 19, 20వ ఓవర్లు వేసేందుకు మా దగ్గర ఆప్షన్లు ఉన్నాయి. 19వ ఓవర్‌ను జోఫ్రా ఆర్చర్‌కు ఇచ్చాం. దీనికి ధ్రువ్ జురెల్ కారణం. కేవలం 12 బంతుల్లో 15 పరుగులు మాత్రమే గుజరాత్‌కు అవసరం. ధ్రువ్ చెప్పడంతో నేనూ ఓ ఛాన్స్ తీసుకున్నా. జోఫ్రా చేతికి బంతినిచ్చాం. దూకుడుగానే ఉండాలని నిర్ణయించుకున్నాం. ఆఖరికి మాకు సానుకూలంగా ఫలితం వచ్చింది. ఇప్పుడు కానీ, అనుకున్నట్లు రాకపోతే.. కచ్చితంగా కాసేపు బాధపడేవాడిని. అయితే, మళ్లీ వచ్చే మ్యాచ్‌లోనూ ఇలాగే ప్రయత్నించేవాడినే.ధ్రువ్ జురెల్ అద్భుతంగా ఆడాడు. అతడి టాలెంట్‌కు తగ్గట్టుగా న్యాయం జరగలేదేమో అనిపిస్తుంటుంది. సాధారణంగా ఆరు లేదా ఏడో స్థానంలో వచ్చే ధ్రువ్ (75) వన్‌డౌన్‌లో ఆడాడు. అతడికి మూడో స్థానంలో బ్యాటింగ్ ఇవ్వాలని తొలుత నేను చెప్పా. ఇది కేవలం ఆరంభం మాత్రమే. ఇలాగే కొనసాగితే కచ్చితంగా 700కిపైగా పరుగులు చేయగలడు. మేం విజేతగా నిలవడం పెద్ద కష్టం కాదు. వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచాం. సంబరాలు చేసుకుంటాం. మళ్లీ గువాహటి మ్యాచ్‌పై దృష్టిపెట్టి.. ముంబయిపై గెలిచేందుకు ప్రయత్నిస్తాం" అని రియాన్ పరాగ్ వెల్లడించాడు.

# తనకంటే ఐశ్వర్యారాయ్ గ్రేట్ అనేసిన అభిషేక్!







బాలీవుడ్ స్టార్ కపుల్ అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్యరాయ్ వివాహ బంధం పై ఏదో వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూనే ఉంటుంది. ఈనేపథ్యంలో తాజాగా ఓ మీట్ లో అభిషేక్ బచ్చన్ వైవాహిక జీవితంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తమ ఇద్దరి మధ్య బంధం అనేది కేవలం భార్యాభర్తల సంబంధం మాత్రమే కాదని అదోక పరిపూర్ణమైన భాగస్వామ్యం అని అభిప్రాయపడ్డారు. -తన తల్లి జయా బచ్చన్ పెళ్లి సమయానికి తండ్రి అమితాబ్ కంటే పెద్ద స్టార్ అని గుర్తు చేసుకున్నారు. అందుకే ఇంట్లో పురుషుడే ఆధిపత్యం చలాయించాలనే ధోరణిలో తాను పెరగలేదని చెప్పారు. ఐశ్వర్యతో తన ప్రయాణం గురించి మాట్లాడుతూ, - కెరీర్ ప్రారంభం నుండే ఆమె తనకు మంచి స్నేహితురాలని, ఆ స్నేహమే తమ మధ్య గౌరవాన్ని, అవగాహనను పెంచిందన్నారు. ఇద్దరి మధ్య కెరీర్ పరంగా ఎప్పుడూ పోటీ లేదని అభిషేక్ వెల్లడించారు. తనకంటే ఐశ్వర్య ఎక్కువ సక్సెస్ సాధించినా తాను ఎప్పుడూ అసూయ పడలేదన్నారు. అది తమ మధ్య ఉన్న ఆరోగ్యకరమైన అవగాహనకు నిదర్శనమన్నారు. ఒకరి గెలుపును మరొకరు సెలబ్రేట్ చేసుకోవడమే తమ బంధంలోని గొప్పతనమని వివరించారు. ఈ విషయంలో తమ మధ్య ఎప్పుడూ చర్చలు కూడా జరగవని అదంతా చాలా సహజంగా సాగిపోతుందన్నారు. అయినా నా కంటే ఐశ్వర్యా రాయ్ గొప్పదనే చెబుతానన్నారు. వైవాహిక జీవితంలో పనులు పంచుకోవడం గురించి కూడా అభిషేక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. -నేను ఆహారం తీసుకువస్తాను. నువ్వు ఇల్లు చూసుకో- అనే నిబంధనలు తమ మధ్య లేవన్నారు. ఏదైనా పనిని ఇద్దరం కలిసి ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఒకరినొకరు గౌరవించుకుంటూ ముందుకు సాగడమే తమ విజయ రహస్యంగా తెలిపారు. తన తండ్రి అమితాబ్ బచ్చన్ తనను లాంచ్ చేయలేదని, తన సొంత కష్టంతోనే ఈ స్థాయికి చేరానని, అదే ఆత్మవిశ్వాసం తన వ్యక్తిగత జీవితంలో కూడా ఉంటుందని పేర్కొన్నారు. దీంతో గత కొన్నాళ్లుగా వీరిద్దరూ విడిపోతున్నారంటూ వస్తోన్న పుకార్లకు అభిషేక్ మాటలు పరోక్షంగా చెక్ పెట్టినట్లు అయ్యింది. తమ వ్యక్తిగత జీవితాన్ని రహస్యంగా ఉంచడానికే ప్రాధాన్యత ఇస్తామని అవసరమైనప్పుడు మాత్రమే స్పందిస్తామని స్పష్టం చేశారు. ఐశ్వర్యరాయ్ - అభిషేక్ 2007లో వివాహం చేసుకోగా వీరికి ఆరాధ్య అనే కుమార్తె ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అభిషేక్ బచ్చన్ తన తదుపరి చిత్రం -కింగ్- షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఇందులో ఆయన షారుక్ ఖాన్‌తో కలిసి నటిస్తున్నారు. అలాగే కొత్త ప్రాజెక్ట్ లు కొన్ని లాక్ చేసారు. అయితే వాటి వివరాలు మాత్రం గోప్యంగా ఉంచారు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965